విశాఖపట్టణం
ఆదివారం 23 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:211 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## జోగి రమేశ్ కుటుంబానికి ఊరట

గృహహింస కేసు: 11 మంది కుటుంబ సభ్యులకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్

రెండు వారాల్లోగా స్టేషన్‌లో లొంగిపోవాలని కోర్టు ఆదేశం

జోగి రమేశ్ సహా ఐదుగురికి ప్రత్యేక షరతులు విధింపు

పాస్‌పోర్టులు స్వాధీనం చేయాలని ఉత్తర్వులు

2





### జగన్‌కు లోకేశ్

## ఐదోసారి సవాల్

డీఎస్సీపై చర్చకు రా.. టైమ్, డేట్ నీ ఇష్టం!

విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం

ఉత్తరాంధ్ర అభివృద్ధికి, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని హామీ

వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేవారికి నో ఎంట్రీ: లోకేశ్

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

డీఎస్సీ నియామకాలపై చర్చకు రావాలంటూ వైసీపీ అధినేత జగన్ కు తాను ఐదోసారి సవాల్ విసురుతున్నానని, దమ్ముంటే చర్చకు రావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. "టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చోవడం కాదు, బయటకు రా!" అని లోకేశ్ తీవ్ర స్వరంతో ..మిగతా 2లో

### వెలిగొండ నిర్వాసితులకు

# రూ.250 కోట్ల పరిహారం

ఆగస్టు 31న ప్రాజెక్టు ప్రారంభం

వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతగా రూ.250 కోట్ల పరిహారం పంపిణీ

ఆగస్టు 31న ప్రాజెక్టు తొలిదశను ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన

గత ప్రభుత్వం వల్లే ప్రాజెక్టు పూర్తి చేయడంలో జాప్యం జరిగిందన్న ముఖ్యమంత్రి

ఐదు నదుల అనుసంధానంతో దేశంలో నీటి భద్రత సాధ్యమని వెల్లడి

మార్కాపురంలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు సెప్టెంబర్‌లో శంకుస్థాపన





ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

దశాబ్దాల నాటి వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా నిలుస్తూ కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. సీఎం చంద్రబాబు నాయుడు మూడో విడత పునరావాస, పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ కింద రూ.250 కోట్ల చెక్కును నిర్వాసిత కుటుంబాలకు అందించారు. ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన చారిత్రక ప్రకటన చేశారు. దీంతో ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కల సాకారం కానుంది. ఇప్పటికే రెండు విడతల్లో పరిహారం అందించిన ప్రభుత్వం, తాజాగా మూడో విడతలో 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు పంపిణీ చేసింది. దీంతో ఇప్పటివరకు మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల మేర పరిహారం అందినట్లయింది. ప్రాజెక్టుకు సంబంధించి ఆర్ అండ్ ఆర్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి నిర్వాసితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. అసాధ్యమనుకున్న ప్రాజెక్టును సుసాధ్యం చేసి చూపిస్తున్నామన్నారు. "1996లో నేను శిలాఫలకం వేసిన ఈ ప్రాజెక్టును 2026లో ప్రారంభించుకోవడం నా అదృష్టం. గత రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి పనులను ..మిగతా 2లో

## మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

ఓచోట 'డబుల్ డెక్', మరోచోట భూగర్భ మార్గం

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలో పలు ప్రత్యేకతలు, సవాళ్లు


హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మెట్రో మార్గం

మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్

మెట్రో రెండో దశలో హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మార్గం

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ ప్రత్యేకతలు, సవాళ్లతో కూడుకున్నది. ఈ మార్గం సంక్లిష్టమైన రైల్వే క్రాసింగ్‌లు, ఫ్లైఓవర్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్లు, విమానాశ్రయ ప్రాంగణాల గుండా వెళ్లాల్సి ఉంటుంది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం రన్‌వే కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు హెచ్ఎండీఏ ప్రణాళిక చేసిన హైవే టన్నెల్ వెంబడి ..మిగతా 2లో



### నాలుగేళ్ల లోపు చిన్నారుల మందులపై

## కేంద్రం ఆంక్షలు

క్లోర్‌ఫెనిరమైన్, ఫినైల్‌ఫ్రైన్ ఉన్న ఎఫ్‌డీసీ మందులకు ఇది వర్తింపు

మందుల లేబుల్‌పై హెచ్చరిక తప్పనిసరిగా ముద్రించాలని ఆదేశం

నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం

ఈ మందుల తయారీ, అమ్మకాలు, పంపిణీపై పరిమితులు




ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్ల లోపు చిన్నారులకు క్లోర్‌ఫెనిరమైన్ మలేట్, ఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) ఔషధాల వాడకంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఈ ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీని పరిమితం చేస్తూ ..మిగతా 2లో



## ఫ్రాన్స్‌లో తొలి హిందూ ఆలయం

ఫ్రాన్స్‌లో మొట్టమొదటి సంప్రదాయ హిందూ దేవాలయ నిర్మాణం పూర్తి

పారిస్‌లోని బుస్సీ-సెయింట్-జార్జెస్‌లో సెప్టెంబర్‌లో ప్రారంభోత్సవం

భారతదేశంలో చెక్కిన రాళ్లతో ఫ్రాన్స్‌లో ఆలయ నిర్మాణం

13 రోజుల పాటు ఘనంగా 'ఫెస్టివల్ ఆఫ్ కల్చర్' వేడుకలు

మహంత్ స్వామి మహారాజ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమాలు

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ఫ్రాన్స్‌లో హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ మొట్టమొదటి భారీ హిందూ దేవాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పారిస్‌లోని బుస్సీ-సెయింట్-జార్జెస్ ..మిగతా 2లో


### గచ్చిబౌలిలో కుప్పకూలిన

## ఏడంతస్తుల భవనం

ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే, నాలాను ఆనుకుని 50 గజాల్లో అక్రమం గా ఈ భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం కూలిన పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై శకలాలు పడ్డాయి. భయంతో పక్కనే ఉన్న హాస్టల్లోకి విద్యార్థులు పరుగులు తీశారు. ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్‌ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు ..మిగతా 2లో



## విశాఖలో బ్రిక్స్ సదస్సు

తొట్లకొండ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించిన ప్రతినిధులు




ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

భారత్ అధ్యక్షతన జరుగుతున్న 2026 బ్రిక్స్ సదస్సులో భాగంగా సాగర నగరం విశాఖపట్నం కీలక సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. బ్రిక్స్ యువజన వ్యవహారాల మంత్రుల సమావేశం, క్రీడా మంత్రుల సమావేశం ఇక్కడ జరుగుతున్నాయి. బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, భారత్, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, ..మిగతా 2లో

For a pure tomorrow..
జయహే

# జగన్‌కు లోకేశ్ ఐదోసారి సవాల్

**మొదటి పేజీ తరువాయి...**

జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శనివారం విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఎలా పనిచేశారని ఆయన ఎద్దేవా చేశారు.

"ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని జగన్, ఇప్పుడు మేం పారదర్శకంగా భర్తీ చేసిన 16 వేల ఉద్యోగాలపై దుష్ప్రచారం చేస్తున్నారు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అంటే కూడా ఆయనకు అవగాహన లేదు. అసెంబ్లీలో వారి ఆరోపణలకు సమాధానం చెప్పినా, బయటకు వచ్చి మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కష్టపడి టెట్, డీఎస్సీ రాసి ఎంపికైన ఉపాధ్యాయులను అవమానించడం మానుకోవాలి" అని లోకేశ్ హితవు పలికారు. జగన్ చెప్పే అబద్ధాలను కార్యకర్తలు బలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

### కార్యకర్తలే పార్టీకి బలం

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, వారి త్యాగాల పునాదులపైనే పార్టీ నిలబడి ఉందని స్పష్టం చేశారు. "కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించే బాధ్యత నాది. కార్యకర్తలు నన్ను వెతుక్కుంటూ రావాల్సిన పనిలేదు. కష్టపడే వారిని నేనే వెతుక్కుంటూ వస్తాను" అని ఆయన భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను న్యాయబద్ధంగా తొలగిస్తామని, ఇప్పటికే 75 శాతం కేసులు పరిష్కారమయ్యాయని



తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నీరు-చెట్టు బిల్లుల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

### ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

గత ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని లోకేశ్ అన్నారు. "భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. టీసీఎస్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలను ఉత్తరాంధ్రకు తీసుకువచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు. అయితే, వైసీపీ ఎంపీ గురుమూర్తి కాగ్నిజెంట్ సంస్థకు భూ కేటాయింపును అడ్డుకోవాలని కోర్టును ఆశ్రయించడం వారి అభివృద్ధి నిరోధక వైఖరికి నిదర్శనమని విమర్శించారు.


### అదితి గజపతిరాజుపై ప్రశంసలు

విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తారని లోకేశ్ ప్రశంసించారు. "అసెంబ్లీలో అదితి గారు రోజుకు మూడుసార్లైనా నా వద్దకు వచ్చి నియోజకవర్గ సమస్యల గురించే మాట్లాడతారు. జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యూసిటీ కోసం గజపతి రాజుల కుటుంబం 150 ఎకరాలు ఉచితంగా ఇవ్వడం వారి దాతృత్వానికి నిదర్శనం" అని కొనియాడారు. సీనియర్ నేత అశోక్ గజపతిరాజు గురించి మాట్లాడుతూ, "ఆయన నానో కారులో తిరిగినా, ఆయన రాజసం రోల్స్ రాయిస్ లాంటిది. గత ప్రభుత్వం ఆయనను ఎన్నో ఇబ్బందులు పెట్టింది. ఎన్ని కేసులు పెట్టినా మా నాయకులకు బలమే కానీ బలహీనత కాదు" అని వ్యాఖ్యానించారు.

### రప్ప రప్ప బ్యాచ్‌కు నో ఎంట్రీ.. స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

వైసీపీ నుంచి టీడీపీలోకి రావాలనుకునే వారికి పార్టీలో స్థానం లేదని లోకేశ్ తేల్చిచెప్పారు. "రప్ప రప్ప అంటే చూస్తూ ఊరుకోం. చట్టాన్ని ఉల్లంఘిస్తే బొక్కలో వేసే బాధ్యత నాది. రెడ్ బుక్ దాని పని అది చేసుకుపోతుంది. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి ఇక్కడ హౌస్‌ఫుల్ బోర్డు పెట్టేశాం" అని హెచ్చరించారు.

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. పంచాయతీ నుంచి ఢిల్లీ వరకు కూటమి ప్రభుత్వాలు ఉంటేనే అభివృద్ధి వేగవంతం అవుతుందని, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేసి అద్భుత విజయాలు సాధించాలని కోరారు. అనంతరం, సమావేశానికి హాజరైన ప్రతి కార్యకర్తతో ఆయన ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



## వెలిగొండ నిర్వాసితులకు
# రూ.250 కోట్ల పరిహారం

**మొదటి పేజీ తరువాయి...**

వేగవంతం చేశాం. ఎన్టీఆర్ ప్రారంభించిన అనేక ప్రాజెక్టులను పూర్తి చేసే అవకాశం నాకు దక్కింది" అని ఆయన గుర్తు చేసుకున్నారు.

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో 50 శాతం లోటు వర్షపాతం ఉందని, శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాని క్లిష్ట పరిస్థితుల్లోనూ వెలిగొండకు నీరివ్వాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని చంద్రబాబు వివరించారు. "2019లో మేం అధికారంలోకి వచ్చి ఉంటే 2021 నాటికే ఈ ప్రాజెక్టు పూర్తయ్యేది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, డ్రామాల వల్లే ఇంత జాప్యం జరిగింది" అని ఆయన విమర్శించారు.

పోలవరం పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీరందించి, శ్రీశైలంలో నీటిని పొదుపు చేయడం ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతాలకు నీరివ్వవచ్చని సీఎం తెలిపారు. దేశంలో నీటి భద్రత సాధించేందుకు గంగా-గోదావరి-కావేరి నదుల అనుసంధానం చేయాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఈ ఐదు నదుల అనుసంధానంతో నాలుగు రాష్ట్రాల నీటి సమస్యలు తీరతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

స్థానిక అభివృద్ధిపైనా చంద్రబాబు పలు హామీలిచ్చారు. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి నీరు అందిస్తామని, పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. సెప్టెంబరులో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసినా, 'సూపర్ సిక్స్' వంటి పథకాలను అమలు చేస్తూనే, అభివృద్ధి, ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు.

## గచ్చిబౌలిలో కుప్పకూలిన
# ఏడంతస్తుల భవనం

**మొదటి పేజీ తరువాయి...**

చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ ఎ÷-లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో టౌన్ ఎ÷-లానింగ్ అధికారులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు సమాచారం. క్రమంగా బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాల నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. అయిన హైడ్రా, సీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నాలుగేళ్ల లోపు చిన్నారుల మందులపై
# కేంద్రం ఆంక్షలు

**మొదటి పేజీ తరువాయి...**

నోటిఫికేషన్ విడుదల చేసింది. సాధారణంగా జలుబు, దగ్గు, అలర్జీ వంటి సమస్యల నివారణకు వాడే ఔషధాలలో ఈ కాంబినేషన్‌ను వినియోగిస్తారు. ఇకపై ఈ మందుల లేబుల్స్, ప్యాకేజీలపై "ఈ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇవ్వరాదు" అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) చేసిన సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గతంలో 2025 ఏప్రిల్ 15న ఈ సమ్మేళనాలు కలిగిన కొన్ని ఎఫ్‌డీసీ మందులపై మాత్రమే ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించగా, తాజా ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనను అన్ని రకాల ఫార్ములేషన్లకు వర్తింపజేసింది. నాలుగేళ్ల లోపు చిన్నారులపై ఈ మందులు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని, వీటికి బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

# ఫ్రాన్స్‌లో తొలి హిందూ ఆలయం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రాంతంలో బీఏపీఎస్ (బోచాసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ) నిర్మించిన ఈ స్వామినారాయణ్ హిందూ మందిరాన్ని సెప్టెంబర్ లో అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2 నుంచి 14వ తేదీ వరకు 13 రోజుల పాటు 'ఫెస్టివల్ ఆఫ్ కల్చర్' పేరిట ప్రత్యేక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలను బీఏపీఎస్ ఆధ్యాత్మిక గురువు మహంత్ స్వామి మహారాజ్ తన ఆశీస్సులతో పర్యవేక్షించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు, శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ ఆలయ ప్రారంభోత్సవం, సాంస్కృతిక ఉత్సవాల గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సత్సంగ సభల్లో మార్చి, ఏప్రిల్ నెలల్లోనే బీఏపీఎస్ అధికారికంగా ప్రకటించింది. యూకే, యూరప్ దేశాల బీఏపీఎస్ హెడ్ యోగవివేక్‌దాస్ స్వామి ప్రత్యేక వీడియో సందేశం ద్వారా ఈ ఆలయ చారిత్రక ప్రాధాన్యతను, ఉత్సవాల వివరాలను తెలియజేశారు. ఈ ఆలయ నిర్మాణంలో ఒక విశేషం ఉంది. ఆలయానికి అవసరమైన రాళ్లను భారత్ నుంచి ఫ్రాన్స్‌కు తరలించడం జరిగింది. ఈ రాళ్లను మన దగ్గర శిల్పులతో చెక్కించి, వాటిని అక్కడ ఆలయ నిర్మాణంలో ఉపయోగించడం జరిగింది. "ఈ ఆలయం భారతదేశంలో తయారై, ఫ్రాన్స్‌లో నిర్మించబడింది. ఇది మాకు ఎంతో గర్వకారణం" అని ఫ్రాన్స్‌లోని ప్రవాస భారతీయురాలు భావి పరేఖ్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన తర్వాత ఇప్పుడు ఈ ఆలయ ప్రారంభోత్సవం తమకు మరో ముఖ్యమైన సందర్భమని ఆమె తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం ఈ ఆలయాన్ని సందర్శించాలని బీఏపీఎస్‌తో అనుబంధం ఉన్న మరో ప్రవాస భారతీయుడు ఆహ్వానించారు. సెప్టెంబర్‌లో జరిగే 13 రోజుల కార్యక్రమాలకు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. ఆలయ ప్రారంభోత్సవానికి ఇప్పటికే శిఖరాలు, మధ్య గోపురంపై 'కలశ', 'ధ్వజ దండ పూజలు' వంటి పవిత్ర కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య శాంతి, సామరస్యం, శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మహంత్ స్వామి మహారాజ్, సీనియర్ స్వాములు, భక్తులు 'పారిస్ మందిర్ మహోత్సవని జై!' అంటూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ ఆలయ ప్రారంభంతో ఫ్రాన్స్‌లోని హిందూ సమాజ చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానుండగా, ఇది సందర్శకులకు గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక అనుభూతిని అందిస్తుందని భావిస్తున్నారు.

# మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

**మొదటి పేజీ తరువాయి...**

1.65 కి.మీ మేర భూగర్భ మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. అదేవిధంగా నాగోల్ టూ శంషాబాద్ మార్గంలో విమానాశ్రయం సమీపంలో 1.6 కి.మీ భూగర్భ మెట్రో విభాగాన్ని ప్రతిపాదించారు. మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్‌లో ఫ్లైఓవర్, రెండో ఎలివేటెడ్ మెట్రో వెళ్లేలా డిజైన్ చేశారు.

శంషాబాద్ విమానాశ్రయానికి సంబంధించి కార్గో విమానాశ్రయ స్టేషన్లతో పాటు విమానాశ్రయ ప్రాంగణంలోనే మెట్రో డిపో ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి ఆమోదం తెలపాలని మెట్రో అధికారులు పౌర విమానయాన శాఖను కోరారు. బేగంపేట విమానాశ్రయ రన్‌వే చుట్టూ ఉన్న 'ఫన్నెల్ జోన్'లో ఎత్తుకు సంబంధించిన పరిమితులు ఉన్నాయి. అందువల్ల శామీర్‌పేట, మేడ్చల్ మెట్రో కారిడార్లను తక్కువ ఎత్తులో నిర్మించేలా ప్రణాళిక చేశారు. ఈ మార్గాలకు అనుమతి కావాలని కోరారు.

రైల్వే క్రాసింగ్‌లు : మెట్రో మార్గం ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, లోతుకుంట, అల్వాల్ వద్ద రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి దక్షిణ మధ్య రైల్వే నుంచి ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం లభించింది. అయితే సుచిత్ర ప్రాంతానికి సంబంధించిన అనుమతి ఇంకా పెండింగ్‌లో ఉంది.

జాతీయ రహదారి మార్గాలు : చీఎ-65 (మదీనాగూడ నుంచి పటాన్‌చెరు వరకు, చింతలకుంట నుంచి హయత్ నగర్ వరకు) చీఎ-44 (ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు, బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు) వెంబడి మెట్రో పిల్లర్ల నిర్మాణానికి సంబంధిత అధికారులు 'రైట్ ఆఫ్ వే' అనుమతులను మంజూరు చేయాల్సి ఉంది.

కేంద్రం వాటా : రూ.6,666 కోట్లు (17%)
రాష్ట్రం వాటా : రూ.11,933 కోట్లు (31%)
రుణాలు : రూ.19,996 కోట్లు (52%)

వివిధ కార్పొరేషన్ల పరిధిలో విస్తరణ : ప్రతిపాదిత రెండో దశ మార్గం జీహెచ్ఎంసీ పరిధిలో 36.5 కి.మీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 24.9 కి.మీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41.3 కి.మీ మేర విస్తరించి ఉంది. ఇంకా 'రైట్ ఆఫ్ వే' అనుమతులను వేగవంతం చేయాలని మెట్రో రైలు అధికారులు హెచ్ఎండీఏ కంటోన్మెంట్ బోర్డును కోరారు.

ప్రతిపాదన వివరాలు :
కారిడార్లు: 7
దూరం: 122.9 కి.మీ
స్టేషన్లు: 86
ప్రాజెక్ట్ వ్యయం: రూ.38,595 కోట్లు
ప్రయాణికులు: 12.42 లక్షలు



## కొత్త ఓటర్ నమోదు ప్రారంభం

**అగనంపూడి, ఆగష్టు 22, జయ జయహే**

ఓటు లేని వారు కొత్తగా ఓటు నమోదు చేసుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీఎన్‌టీయసీ అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం అగనంపూడి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో కొత్త ఓటర్ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2002సంవత్సరం తర్వాత 2026 సంవత్సరంలో ఓటు సవరణ ఇటీవల జరిగిందని గుర్తు చేశారు. 18 సంవత్సరాలు వయసు దాటిన వారు నూతన ఓటు నమోదు, చిరునామా మార్పు, ఇటీవల చనిపోయిన వారు ఉంటే వారి ఓటును తొలగించుట వంటి కార్యక్రమాలు ఆగస్టు 22, 23, 29, 30 తేదీలలో నిర్వహిస్తున్నారని తెలిపారు. అర్హులైన వారు ఎన్నికల బూత్ బీఎలఓ దగ్గరికి వెళ్లి సరి చేసుకోవాలని కోరారు. సమాజంలో ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా తమ ఓటును ఉందో లేదో బి ఎల్ ఓ దగ్గర వెళ్లి లిస్టులో చూసుకోవాల్సిందిగా కోరారు. టిడిపి నాయకులు వడ్డాది శ్రీనివాసరావు, బండారు చందు రమేష్, పలక అచ్యుత్, జనసేన పార్టీ నాయకులు ద్వారపూడి సుబ్రమణ్యం, కొండయ్య వలస అండమాన్ కొండయ్య వలస పెదమడక సాయి నగర్ అట్టవానిపాలెం గ్రామాల బీఎలఓలు కే లావణ్య, పి సంతోష్, ఎం మల్లేశ్వరరావు, అనకాపల్లి హైమావతి, ఏ శ్రావణి, సిహెచ్ విజయ శ్యామ్ శంకర్ ,ఎం సుజాత లు పాల్గొన్నారు.



## నిమ్న వర్గాలకు తోడుగా కూటమి ప్రభుత్వం

**జంగారెడ్డిగూడెం జయ జయహే**

అణగారిన వర్గాల కు అండగా కూటమి ప్రభుత్వం వుందని ముఖ్యంగా ఎస్ సి ల సంక్షేమం కోసం అహర్ని సలూ ముఖ్యమంత్రి ఆరాట పాడు తున్నారని రాష్ట్ర ఎస్ సి కమీషన్ చైర్మన్ కె ఎస్ జవహర్ పేర్కొన్నారు. స్థానిక రూరల్ మండలం లోని శ్రీనివాసపురం గ్రామం లో ఎం ఆర్ పి ఎస్ కార్యకర్త పొలిమేర శ్రీనివాస్ తండ్రి పెద్ద బజారయ్య ఇటీవల అనారోగ్యం తో మృతి చెందిన నేపథ్యంలో శనివారం జవహర్ వారి కుటుంబాన్ని పరా మర్శించారు కాగా శ్రీనివాస పురం చేరుకున్న ఎస్ సి కమీషనర్ చైర్మన్ ను తొలుత పలువురు ఎం ఆర్ పి ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూల దండలు వేసి శాలువా కప్పి స్వాగతం పలికారు. తరువాత ఆయన బాధిత కుటుంబసభ్యులఇంటికి వెళ్ళి పరా మర్శించి మృతి చెందిన బజారయ్య చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో టిడిపి మండల ఉపాధ్యక్షుడుగొల్ల మంద ల శ్రీనివాస్, పగడం సౌభాగ్య వతి, సొసైటీ అధ్యక్షులు గంధం గోపాలకృష్ణ, బొబ్బర రాజ్ పాల్, పి రామ్ కుమార్, వేంపల రాజు, విస్సాం పల్లి సిద్దు, పోలవరం ఇంచార్జి బొబ్బరఎలీషా తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో బ్రిక్స్ సదస్సు

**మొదటి పేజీ తరువాయి...**

బౌద్ధ క్షేత్రంలో మొక్కలు నాటారు. తొట్లకొండలోని మహాస్తూపం, బావులు, పాకశాల, ధ్యాన కేంద్రాలను పరిశీలించారు. విదేశీ ప్రతినిధులకు ఇక్కడి పురావస్తు అవశేషాలు, అప్పటి బౌద్ధజీవన విధానానికి సంబంధించిన విశేషాలను అధికారులు వివరించారు. ఈ సాయంత్రం విదేశీ ప్రతినిధులకు ఇచ్చే విందులో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఈ సదస్సుకు భారత్‌తో పాటు బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు. శనివారం ఉదయం తొట్లకొండలో మొక్కలు నాటడంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. భారత్ అధ్యక్షతన జరగనున్న సమావేశాలను 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తం ఆధారంగా నిర్వహించనున్నారు. కేంద్ర మంత్రి మాండవీయ తొలుత ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. శనివారం జరిగే సమావేశంలో విద్య, నైపుణ్యాలు, వ్యవస్థాపకత, సంక్షేమం, సుస్థిరాభివృద్ధి వంటి అంశాలపై చర్చిస్తారు. ఉమ్మడి ప్రకటననూ, సహకార కార్యాచరణ విధానాన్నీ ముగింపు సందర్భంగా ఆమోదిస్తారు. ఆదివారం జరగనున్న క్రీడా మంత్రుల సమావేశంలో క్రీడల విధానంలో ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించడంపై చర్చించనున్నారు. దేశీయ క్రీడలు, క్రీడా రంగంలో సాంకేతిక సహకారం, క్రీడా పరికరాల తయారీ, ఉమ్మడి ప్రకటన ఖరారు చేసే అంశాలపై సమావేశం దృష్టి సారించనుంది. కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల సహాయ మంత్రి రక్షా ఖడ్సే ముగింపు వేడుకల్లో పాల్గొని మాట్లాడతారు. చివరిగా 11 బ్రిక్స్ దేశాల మంత్రులతో కూడిన ప్రతినిధి బృందాలు ఉమ్మడి ప్రకటనకు ఆమోదం తెలుపుతాయి.

## గృహహింస కేసు: జోగి రమేశ్ కుటుంబానికి ఊరట


**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ సహా ఆయన కుటుంబ సభ్యులకు గృహహింస కేసులో ఊరట లభించింది. వీరికి షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు వెలువడిన రెండు వారాల్లోగా జోగి రమేశ్‌తో పాటు మొత్తం 11 మంది నిందితులు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోవాలని కోర్టు ఆదేశించింది. ఒక్కొక్కరు రూ. 25 వేల చొప్పున ఇద్దరు వ్యక్తిగత పూచీకత్తులను సమర్పించి బెయిల్ పొందవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇదే క్రమంలో ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న జోగి రాజీవ్ (ఏ1), జోగి రమేశ్ (ఏ2), శకుంతల (ఏ3), రేష్మా ప్రియాంక (ఏ4), రోహిత్ (ఏ5)లకు న్యాయస్థానం కొన్ని ప్రత్యేక షరతులు విధించింది. కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి శనివారం దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. అలాగే, తమ పాస్‌పోర్టులను కోర్టుకు అప్పగించాలని, న్యాయస్థానం అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని ఆదేశించింది. దర్యాప్తు ప్రక్రియకు నిందితులు పూర్తిగా సహకరించాలని కోర్టు పేర్కొంది. జోగి రమేశ్ కోడలు మేఘన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు ఆయనతో పాటు మొత్తం 11 మంది కుటుంబ సభ్యులపై హత్యాయత్నం, గృహహింస, వరకట్న నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు.

# సిఎం చంద్రబాబుని కలిసిన చోడవరం జనసేన రాజు

**చోడవరం,ఆగస్టు 22,జయ జయహే**

మాడుగుల పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని శనివారం చోడవరం జనసేన పార్టీ ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజు వ్యక్తిగతంగా కలిశారు. ఈ సందర్భంగా చోడవరం నియోజకవర్గానికి సంబంధించిన మూడు ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా భీమిలిపట్నం--నర్సీపట్నం రాష్ట్ర రహదారిలో చోడవరం నియోజకవర్గ పరిధిలోని రహదారి పూర్తిగా దెబ్బతినడంతో గత ఎనిమిదేళ్లుగా వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజు ముఖ్యమంత్రి కి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారి నిర్మాణం జరగకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కూటమి ప్రభుత్వ హయాంలో ఈ రహదారి నిర్మాణాన్ని అత్యవసరంగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలన కోరారు.



**కల్యాణపులోవ జలాశయం పరిరక్షణ**

రావికమతం మండలంలోని కల్యాణపులోవ జలాశయం బ్యాక్‌వాటర్స్‌ను కొంతమంది వ్యక్తులు మట్టితో కప్పివేస్తుండటంతో ఆయకట్టు పరిధిలోని వ్యవసాయ భూములకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని పీవీఎస్ఎన్ రాజు తెలిపారు.జలాశయానికి సంబంధించిన రికార్డులు అందుబాటులో లేవని సంబంధిత అధికారులు పేర్కొంటుండటం, అధికారుల నిర్లక్ష్య ధోరణిపై రైతులు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు.ఈ అంశంపై జిల్లా యంత్రాంగానికి తక్షణమే కఠిన ఆదేశాలు జారీ చేసి, కల్యాణపులోవ జలాశయాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

**చోడవరం చక్కెర కర్మాగారం బకాయిలు**

చోడవరం చక్కెర కర్మాగారానికి సంబంధించి రైతులు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించే విధంగా తగిన నిర్ణయం తీసుకోవాలని పీవీఎస్ఎన్ రాజు ముఖ్యమంత్రి ని కోరారు.పీవీఎస్ఎన్ రాజు ప్రస్తావించిన మూడు ప్రధాన సమస్యలను సావధానంగా విన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యలపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ కి ఆదేశాలు జారీ చేశారు.



## రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

**మాడుగుల ఆగస్టు 22 జయ జయహే**



స్వర్ణాంధ్ర స్వచ్ఛాఆంధ్ర కార్యక్రమమంలో పాల్గొనేందుకు శనివారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి అనకాపల్లి జిల్లా కె-కోటపాడు మండలం, ఏ-కోడూరు గ్రామంలో హెలికాప్టర్ ద్వారా 10-52 నిమిషాలకు చేరుకున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, హోమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, చోడవరం శాసనసభ్యులు కే ఎస్ ఎన్ ఎస్ రాజు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజీ కుమార్ వివిధ కార్పొరేషన్ల చైర్మన్ లు, డైరెక్టర్ లు, జిల్లా, మండల నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలికారు.

### ఈనెల 24న చోటువాడలో

## మెగా జాబ్ మేళా

**మాడుగుల ఆగస్టు 22 జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోఉద్యోగ కల్పనలో భాగంగా కె కోటపాడు మండలం చౌడువాడ హైస్కూల్లో 24న సుమారు 16 బహుళజాతీయ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి పి. రోహిణి శనివారం తెలియజేసారు.ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి,ఐ టి ఐ, డిప్లొమా,డిగ్రీ,పి జి వరకు చదువుకొని 18 నుండి 40 సంవత్సరముల వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చున్నారు. కాబట్టి ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరములను నైపుణ్యం. ఏపీ. జిఓవి. ఇన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డు తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు,ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో జాబ్ మేళా జరుగు ప్రదేశానికి ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.మరిన్ని వివరాలకు 7981102224 నంబర్ ను సంప్రదించగలరు.

## ఏ కోడూరు సభలో గ్రీన్ అంబాసిడర్లను సత్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**మాడుగుల ఆగస్టు 22 జయ జయహే**




మాడుగుల నియోజకవర్గం పరిధిలోగల చీకటిపాడు మండలం అలమండ కోడూరులో శనివారం జరిగిన స్వర్ణ చంద్ర కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ అలమండ కోడూరుగా మార్చిన గ్రీన్ అంబాసిడర్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు సత్కారం చేశారు.పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేసి ముఖ్యమంత్రి మొమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీలు రమేష్, చింతకాయల విజయ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు




## ముగిసిన ఏ ఏ పి దీక్షలు

**చోడవరం,ఆగస్టు 22 జయ జయ హే**

గోవాడ చెరుకు రైతులు,కార్మికుల బకాయిలు చెల్లించాలనీ కోరుతూ..ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా చేపట్టిన నిరసన కార్యక్రమాలను శనివారంతో ముగిసాయి. సుమారు 70 సంవత్సరాల చరిత్ర గల గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూత పెట్టడం జరిగిందనీ, 23700 షేర్ హోల్డర్స్ ఉన్న రైతులకు నేటికీ 38 కోట్ల రూపాయలు పడి ఉన్న ఈ ప్రభుత్వం నేటి కూడా చెల్లించకుండా రైతులను రోడ్డు మీద పడేసశీదన్నారు. దీనికి సంబంధించి 15 రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్న తరుణంలో ప్రభుత్వంలో కొంత కదలక వచ్చిన నేపథ్యంలో కొంతకాలం ఈ నిరసన కార్యక్రమానికి నిలుప్పుదల చేసి గ్రామ గ్రామాన రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పాదయాత్రలో మొదలుపెట్టి తర్వాత మరల ఈ ప్రభుత్వంలో మార్పు రాకపోతే నిరాహార దీక్ష కార్యక్రమం చేపడతామని ఆమాద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చోడవరం మండల కార్యదర్శి వేగి మహాలక్ష్మి నాయుడు వెంకటపతి రాజు పల్లి వెంకటరమణమూర్తి కామిరెడ్డి శంకర్రావు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన రాజేష్‌కు అభినందనలు తెలిపిన మంత్రి అనిత

**విజయనగరం 22: (జయ జయహే)**

నెల్లిమర్ల ఎంపీపీఎస్ చినమల్లుపేటలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా సేవలందిస్తున్న రాజేష్ కౌలూరి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం పూర్తి చేసి, అదే ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ జాతీయ స్థాయిలో అత్యున్నత ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం రాజేష్ కౌలూరి అంకితభావానికి నిదర్శనమని మంత్రి అనిత పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రాజేష్ కౌలూరి చేస్తున్న అంకితభావంతో కూడిన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాజేష్ కౌలూరి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన రాజేష్ కౌలూరికి హోం మంత్రి అనిత హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరింత అంకితభావంతో విద్యార్థుల అభ్యున్నతికి సేవలందించాలని ఆకాంక్షించారు.



## నిరుపేద వైద్యానికి సీఎంఆర్ఎఫ్ చేయూత: మంత్రి దుర్గేష్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిరుపేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలు క్యాంపు కార్యాలయంలో 45 మంది లబ్ధిదారులకు రూ.48.39 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 39 మందికి రూ.25.53 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఆరుగురికి రూ.22.85 లక్షల విలువైన ఎల్ఓసీలు అందించినట్లు తెలిపారు. నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,092 మందికి సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా రూ.7.66 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు.పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా ప్రభుత్వం నిరంతరం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి తెలిపారు. సకాలంలో సీఎంఆర్ఎఫ్ నిధులు విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రంథాలయ సమస్యల పరిష్కారానికి మంత్రి వీరాంజనేయ స్వామికి వినతి

**విశాఖపట్నం, ఆగష్టు 22, జయ జయహే :**



ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయ స్వామికి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీష్ కుమార్ వినతిపత్రం సమర్పించారు. మౌలిక సదుపాయాల కొరత, సిబ్బంది కొరతను తక్షణమే పరిష్కరించాలని కోరారు. గ్రంథాలయానికి శాశ్వత భవన నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు తాత్కాలిక వసతి జిల్లా కేంద్ర గ్రంథాలయం కార్యాలయాలు ప్రైవేట్ అద్దె భవనాల్లో నడుస్తుండటంతో ప్రభుత్వ ధనం వృథా అవుతోందని, సంస్థ సొంత స్థలంలో శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యే వరకు, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ఎదురుగా ఉన్న 'డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్' 5వ అంతస్తులో సుమారు 8,000 పైగా చదరపు అడుగుల స్థలాన్ని తాత్కాలిక వసతికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రంథాలయాలలో తీవ్రమైన సిబ్బంది కొరత కారణంగా పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పాలనను వేగవంతం చేసేందుకు అవసరమైన ఔట్‌సోర్సింగ్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను పునరుద్ధరించేలా అధికారులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత, పాఠకుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే స్పందించి తాత్కాలిక వసతి మరియు ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## మోహన్ భగవత్‌ను కలిసిన గంటా

**ఆనందపురం, ఆగస్టు 22 (జయ జయహే )**

(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ తో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భేటీ అయ్యారు. గుడిలోవ విజ్ఞాన్ విహార్ లో జరిగిన అఖిల భారత సమన్వయ బైఠక్ లో పాల్గొనడానికి వచ్చిన భగవత్ ను నార్త్ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజుతో కలిసి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 19 న ప్రారంభమైన సమన్వయ బైఠక్ 21 వరకు జరిగిన సంగతి తెలిసిందే. దేశం పట్ల ఎంతో నిబద్ధత కలిగిన భగవత్ లాంటి గొప్పవ్యక్తిని కలుసుకోవడం సంతోషంగా ఉందని గంటా పేర్కొన్నారు. భగవత్ నిరాడంబర వ్యక్తిత్వం ఆయన్ని ఈ స్థాయికి చేర్చిందన్నారు. భగవత్ సహా ఆర్ఎస్ఎస్ సర్ కార్యవహ దత్తాత్రేయ హోసబలే, ఆర్.ఎస్.ఎస్. ప్రముఖులు వి.భాగయ్య, దూసి రామకృష్ణ తదితరులను కూడా గంటా కలిశారు. అనంతరం వారితో సహ పంక్తి భోజనం చేశారు.




## గురుకుల పాఠశాల స్వచ్ఛాంధ్రాలో గంటా

**మధురవాడ, ఆగస్టు 22: (జయ జయహే)**

జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన "ఆరోగ్య పాఠశాలలు - ఆరోగ్య ఆంధ్రా" అంశంలో భాగంగా పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వచ్ఛాంధ్రా ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చేలా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు శిక్షణనివ్వాలని గంటా పేర్కొన్నారు. 627 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఫలితాలు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. హాస్టల్ లో నీటి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే బోరు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, ఏ.ఎం.హెచ్.ఓ. రాజా రవికుమార్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ శాంతకుమారి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల జానకిరాం, పోలిశెట్టి నాగేశ్వరరావు, మన్యాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో




# ఆత్మజ్ఞాన దర్శనం

జీవనక్రమంలో మానవులందరికీ ఆత్మసాక్షాత్కారం చాలా ముఖ్యమైనది. ఆత్మ అనగా మన శరీరంతో పాటుగా మనలో అంతర్లీనంగా అంతర్వాణిని తెలియజేసే అంతర్గత చైతన్యమే ఆత్మ. ఇది స్వచ్ఛమైన చైతన్యం. దీనికి మరణం లేదు. నాశనం లేదు వినాశనం లేదు. శరీరానికి మూలమైనది ఆత్మ మాత్రమే చేర మంతా ఏదో ఒక రోజు నశించిన ఆత్మకు మాత్రం అస్సలు నాశనం అనేది ఉండదు. ఈ ఉరకలు పరుగులు జీవన క్రమంలో మనం మన శరీరంతో అనేకానేక కర్మలు చేస్తూ నిత్యం పరిగెత్తించే మనసును ప్రేరేపితం చేసేది ఆత్మ.

ప్రతి మానవుడు జీవన సాధన క్రమంలో ఎంతో కొంత విద్యను అభ్యసిస్తాడు బడిలో చదివేదే విద్య అని మనం అనుకుంటాం కానీ

" సా విద్య యా విముక్తయే " ఏది మనిషికి ముక్తిని శాంతిని ఇస్తుందో అదే నిజమైన విద్య.

ఉపనిషత్తుల్లో సాధారణంగా మనం తెలుసుకోవలసిన విద్యను రెండు రకాలుగా చెప్పారు. అందులో అతి ముఖ్యమైనది ఇప్పుడు ఏమిటంటే పరవిద్య అనగా ఆత్మజ్ఞానం. భయాన్ని అజ్ఞానాన్ని సమస్యలను కుంగుబాటులను కుంటనానికి లోనయ్యే సమయంలో ఏర్పడే భయాలను పోగొట్టేది ఆత్మజ్ఞానం. పురాణాల్లో ఇతిహాసాల్లో ఇతర గ్రంథాలలో ఎంతో మంది పాత్రలు చిత్ర విచిత్ర సన్నివేశాలు చూస్తూ ఉంటాము. వారందరిలో అనేక రకాలైన భావనలు కలిగి ఉంటాయి.అవి నిరంతరం మానవజాతి నంతటినీ దిశా నిర్దేశం చేసి నడిపిస్తూ ఉంటాయి. ఈ ఆత్మ జ్ఞానాన్ని మనం అంతర్లీనంగా మన అంతర్వాణిలో వినాలి అంటే గీత శ్రమణం చేసి శరీరం వేరు ఆత్మ వేరు అని తెలుసుకోవాలి. శాంతి కోసం ధ్యానం చేయాలి. ఇవన్నీ చేస్తే మనకు ఖచ్చితంగా నిరంతరం మంచి ఆలోచనలతో కూడిన భావనలు మన మనసుతో ఏకీభవించి ఉత్తమ చైతన్య స్వరూపులుగా మనల్ని తయారు చేసి మనలో ఉన్న కుతంత్రం, రాగద్వేషాలు, వ్యామోహాలు, భయాలు,బాధలను, ఇతర సామాజిక రుగ్మతలను తొలగించి మనల్ని భావితరానికి మార్గదర్శకులుగా ఆత్మజ్ఞానం చేస్తుంది. దీని ద్వారా అనేక రకాలైన సత్ఫలితాలు లభిస్తాయి. మన అంతర్వాణిలో ఆలోచనలు కూడా ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని ఉత్తేజాన్ని చవిచూస్తాయి.



రచన
ఏ బాల సౌజన్యకుమారి
తెలుగు ఆచార్యులు
నంది అవార్డు గ్రహీత
ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త

# వానర సైన్యం-ఐక్యతలోనే అసలైన శక్తి

**రామాయణంలో వానరులు కేవలం శ్రీరాముడికి సహాయపడిన యోధుల సమూహం మాత్రమే కాదు. వారు ఐక్యత, సామూహిక కృషి, విశ్వాసం, సేవాభావం, సమన్వయం వంటి విలువలకు ప్రతీకలు. సుగ్రీవుడు, హనుమంతుడు, అంగదుడు, జాంబవంతుడు వంటి వానర వీరులు తమ వ్యక్తిగత ప్రతిభను ఒక గొప్ప లక్ష్యానికి అంకితం చేశారు. వారి సమిష్టి కృషి రామాయణ కథలో కీలక మలుపులకు కారణమైంది.**




### ఒక్కరి బలం కాదు -- అందరి బలం

ఒక వ్యక్తి ఎంత ప్రతిభావంతుడైనా అతని సామర్థ్యానికి కొన్ని పరిమితులు ఉంటాయి. కానీ అనేక మంది తమ శక్తులను ఒకే లక్ష్యం కోసం సమీకరిస్తే అసాధ్యమనిపించే పనులు కూడా సాధ్యమవుతాయి. సముద్రంపై వారధి నిర్మాణం దీనికి ప్రతీకాత్మక ఉదాహరణగా నిలుస్తుంది.

శ్రీరాముని కోసం వానరులు చేసిన కృషిలో ఎవరి పాత్రా చిన్నది కాదు. ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన పని చేశారు. అదే సామూహిక విజయానికి అసలు సూత్రం.

### ప్రతిభలు వేరు -- లక్ష్యం ఒక్కటే

వానర సైన్యంలో ప్రతి నాయకుడికీ ప్రత్యేకమైన సామర్థ్యం ఉంది. హనుమంతుడు ధైర్యం, శక్తి, కార్యదీక్షకు ప్రతీక. జాంబవంతుడు అనుభవం, జ్ఞానానికి ప్రతిరూపం. అంగదుడు యువశక్తి, నాయకత్వానికి ప్రతీక. సుగ్రీవుడు వ్యవస్థీకరణకు ప్రతినిధి.

వారి ప్రతిభలు వేర్వేరైనా లక్ష్యం మాత్రం ఒక్కటే. సామర్థ్యాల వైవిధ్యాన్ని సంఘటిత శక్తిగా మార్చడం నేటి సంస్థలకు కూడా అత్యవసరం.

### సంస్థలకు వానర సైన్యం ఒక పాఠం

ఆధునిక కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ వ్యవస్థలు, సామాజిక సంస్థలు అన్నీ జట్టు కృషిపైనే ఆధారపడి ఉన్నాయి. ఒక నాయకుడు ఎంత సమర్థుడైనా అతని వెనుక సమర్థమైన బృందం లేకపోతే పెద్ద లక్ష్యాలను సాధించడం కష్టం.

వానర సైన్యం మనకు సమూహ నాయకత్వం గురించి ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది. నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు; ప్రతి సభ్యుడి ప్రతిభను గుర్తించి, దానిని సమష్టి ప్రయోజనానికి ఉపయోగించుకోవడం.

### వ్యక్తిగత విజయమా? జట్టు విజయమా?

నేటి పోటీ ప్రపంచంలో వ్యక్తిగత విజయానికి ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ఎవరు ముందున్నారు? ఎవరు ఎక్కువ సాధించారు? ఎవరి పేరు ఎక్కువగా వినిపిస్తోంది? అనే ప్రశ్నలు మన చుట్టూ కనిపిస్తాయి.

అయితే వానరుల కథ మరో విలువను గుర్తుచేస్తుంది: జట్టు విజయం వ్యక్తిగత కీర్తి కంటే గొప్పది. ఒకరి విజయం వెనుక అనేక మంది కనిపించని కృషి ఉంటుంది. అందుకే విజయాన్ని పంచుకోవడం, బాధ్యతను పంచుకోవడం, కీర్తిని పంచుకోవడం కూడా నాయకత్వంలో భాగమే.

### సహకారానికి పునాది విశ్వాసం

సహకారం కేవలం కలిసి పనిచేయడం కాదు. దాని వెనుక విశ్వాసం, పరస్పర గౌరవం, బాధ్యత, అనుబంధం ఉండాలి. వానరుల మధ్య ఏర్పడిన బంధం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

ఆధునిక ఉద్యోగ ప్రదేశాల్లోనూ ఇదే అవసరం. ఒకరిపై మరొకరికి నమ్మకం లేని బృందంలో ప్రతిభ ఉన్నా సమర్థత ఉండదు. విశ్వాసం ఉన్న బృందం మాత్రం పరిమిత వనరులతోనూ గొప్ప ఫలితాలను సాధించగలదు.

### నేటి ప్రపంచానికి మరింత అవసరం

వాతావరణ మార్పు, పేదరికం, అసమానత, సామాజిక అన్యాయం వంటి సమస్యలు ఒక్క వ్యక్తి పరిష్కరించగలిగేవి కావు. దేశాలు, సంస్థలు, సమాజాలు, వ్యక్తులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

ఈ నేపథ్యంలో వానర సైన్యం ఒక పురాతన కథలోని సమూహం మాత్రమే కాదు; సామూహిక బాధ్యతకు ఒక శాశ్వత రూపకం. ఒక మంచి లక్ష్యం కోసం ప్రజలు ఏకమైతే మార్పు సాధ్యమవుతుందని అది సూచిస్తుంది.

### నాయకుడి వెనుక నిలిచే బృందం

శ్రీరాముని విజయాన్ని కేవలం రాముడి విజయంగా చూడటం అసంపూర్ణమైన దృష్టి. ఆ విజయానికి వెనుక వానరుల శ్రమ, హనుమంతుడి కార్యదీక్ష, జాంబవంతుడి జ్ఞానం, అంగదుడి ధైర్యం, అనేక మంది యోధుల అంకితభావం ఉన్నాయి.

ఇది ప్రతి రంగానికీ వర్తించే సత్యం. ప్రతి నాయకుడి వెనుక ఒక బృందం ఉంటుంది; ప్రతి గొప్ప విజయానికి వెనుక అనేక చేతుల కృషి ఉంటుంది.

### ఏకతే నిజమైన శక్తి

వానర సైన్యం మనకు అందించే ప్రధాన సందేశం స్పష్టమైనది: వ్యక్తిగత ప్రతిభ విజయానికి ఆరంభం కావచ్చు; కానీ సామూహిక శక్తి మాత్రమే దానిని విజయవంతమైన ఫలితంగా మార్చగలదు.

రామాయణంలోని వానరులు అందుకే కేవలం పురాణ పాత్రలు కాదు. వారు నేటి సమాజానికి కూడా అవసరమైన ఐక్యత, సహకారం, సమన్వయం, సేవాభావం, సామూహిక బాధ్యత వంటి విలువలకు ప్రతీకలు.

ఒంటరిగా మనం ఒక అడుగు వేయగలం; కలిసివెళితే ఒక మార్గాన్ని నిర్మించగలం.

అదే వానర సైన్యం మనకు అందించే శాశ్వత సందేశం --- " ఏకమై ఉన్న శక్తిని ఏ అడ్డంకీ సులభంగా ఓడించలేదు ."



ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు

# విమానయాన ధరల నియంత్రణతో పాటు సుస్థిరత కూడా ముఖ్యమే

(సి.హెచ్.ప్రతాప్)




విమాన ప్రయాణం ఇక సంపన్న వర్గాలకే పరిమితమైన సేవ కాదు. వేగంగా పెరుగుతున్న మధ్యతరగతి, పెరుగుతున్న వ్యాపార అవసరాలు, దేశీయ పర్యాటకం, కొత్త విమానాశ్రయాలు, మెరుగైన అనుసంధానం కారణంగా విమానం సామాన్యుడి ప్రయాణ సాధనంగా మారుతోంది. భారత విమానయాన రంగం ఈ మార్పుకు ప్రతిబింబం. 2024--25లో భారతీయ షెడ్యూల్డ్ విమానయాన సంస్థలు 16.55 కోట్ల మంది దేశీయ ప్రయాణికులను తీసుకెళ్లాయి. 2023--24లో ఈ సంఖ్య 15.37 కోట్లు కాగా, ఏడాదిలో 7.7 శాతం పెరిగింది. 2025లో భారత్ నుంచి బయలుదేరిన లేదా భారత్‌కు చేరుకున్న మొత్తం విమాన ప్రయాణికుల సంఖ్య 21.82 కోట్లు కాగా, ప్రపంచంలో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో అతిపెద్ద విమాన ప్రయాణ మార్కెట్‌గా నిలిచింది.

అయితే విమాన టికెట్ల ధరలు ప్రయాణికులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా పండుగలు, సెలవులు, వారాంతాలు లేదా అత్యవసర ప్రయాణ సమయాల్లో డిమాండ్ పెరిగినప్పుడు టికెట్ ధరలు గణనీయంగా పెరగవచ్చు. దీనికి కారణం కేవలం విమానయాన సంస్థల ధర నిర్ణయం కాదు. డిమాండ్, అందుబాటులో ఉన్న సీట్లు, ప్రయాణ సమయం, పోటీ, ఇంధన ధరలు, నిర్వహణ వ్యయాలు, విమానాశ్రయ రుసుములు, విదేశీ మారకపు విలువ వంటి అనేక అంశాలు కలిసి టికెట్ ధరను నిర్ణయిస్తాయి.

ఇక్కడే అసలు సమతుల్యత అవసరం. ప్రయాణికుడికి విమాన టికెట్ అందుబాటులో ఉండాలి; అదే సమయంలో విమానయాన సంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకోగలగాలి. భారతీయ విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో విమాన ఇంధనం వాటా సాధారణంగా 40 నుంచి 45 శాతం వరకు ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. అంతేకాకుండా విమాన ఇంధనంపై రాష్ట్రాల విలువ ఆధారిత పన్ను 0 నుంచి 29 శాతం వరకు మారుతోంది. కాబట్టి టికెట్ ధరలను ఒకే గరిష్ఠ పరిమితిలో బంధించడం ద్వారా ప్రయాణికుడికి తక్షణ ఉపశమనం కలిగినా, ఖర్చులు పెరిగిన సమయంలో విమానయాన సంస్థల ఆర్థిక సామర్థ్యంపై ఒత్తిడి పెరగవచ్చు.

దాని ప్రభావం చివరకు ప్రయాణికుడిపైనే పడే అవకాశం ఉంది. ఆదాయం తగ్గితే సంస్థలు కొత్త విమానాల కొనుగోళ్లు వాయిదా వేయవచ్చు, తక్కువ డిమాండ్ ఉన్న మార్గాలను తగ్గించవచ్చు లేదా కొత్త ప్రాంతాలకు సేవలను విస్తరించడంలో వెనుకడుగు వేయవచ్చు. ప్రస్తుతం భారత దేశీయ విమానయానంలో ప్రయాణికుల సీట్ల వినియోగం 85.2 శాతంగా ఉంది. అంటే డిమాండ్ బలంగా ఉన్నప్పటికీ, అదనపు విమాన సామర్థ్యాన్ని పెంచడం కూడా అత్యవసరం.

అందువల్ల పరిష్కారం కేవలం టికెట్ ధరలకు పరిమితి విధించడంలో లేదు. విమానయాన సంస్థల వ్యయాలను తగ్గించే మార్గాలను అన్వేషించడం మరింత స్థిరమైన పరిష్కారం. విమాన ఇంధనంపై పన్నుల భారాన్ని హేతుబద్ధీకరించడం, విమానాశ్రయ రుసుములను సమీక్షించడం, పోటీని పెంచడం, కొత్త విమాన మార్గాలను ప్రోత్సహించడం, ప్రాంతీయ అనుసంధానాన్ని విస్తరించడం ద్వారా టికెట్ ధరలపై సహజమైన నియంత్రణ ఏర్పడుతుంది. ప్రాంతీయ అనుసంధాన పథకంలో ప్రభుత్వ సహకారంతో నడిచే కొన్ని సీట్లకు ఇప్పటికే గరిష్ఠ చార్జీ పరిమితి విధానం అమల్లో ఉంది.

అదే సమయంలో ప్రయాణికులకు ధరల పారదర్శకత అత్యంత అవసరం. టికెట్ ధర ఎలా మారుతోంది, ఏ రుసుములు అదనంగా ఉన్నాయి, ముందస్తు బుకింగ్‌తో ఎంత ఆదా చేయవచ్చు వంటి సమాచారాన్ని స్పష్టంగా అందించాలి. అసాధారణ పరిస్థితుల్లో ధరల పెరుగుదలపై పర్యవేక్షణ ఉండాలి.


విమాన ప్రయాణం చౌక కావడం ఒక ముఖ్యమైన లక్ష్యం. కానీ చౌకైన టికెట్ కోసం బలహీనమైన విమానయాన రంగాన్ని సృష్టించడం పరిష్కారం కాదు. ప్రయాణికుడికి అందుబాటు ధర, విమానయాన సంస్థలకు ఆర్థిక స్థిరత్వం, దేశానికి విస్తృత అనుసంధానం---ఈ మూడు కలిసినప్పుడే భారత విమానయానం నిజమైన ప్రజా రవాణా సాధనంగా ఎదుగుతుంది.

## కరెన్సీ నోట్లతో ముసలమ్మ తల్లికి
# ధనలక్ష్మి అలంకరణ

### భక్తజనంతో కిటకిటలాడిన కడియపులంక

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 22**

:కడియపులంక శ్రావణ శుక్రవారం సందర్భంగా కడియపులంక శ్రీ ముసలమ్మ అమ్మవారు కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శ్రమించి రూ.50 లక్షల విలువైన కరెన్సీ నోట్లు, నాణేలతోఅమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని ఆకట్టుకునేలా అలంకరించారు. రూ.1 నాణెం నుంచి రూ.500 నోట్ల వరకు నూతన కరెన్సీని వినూత్న ఆకృతుల్లో ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.తెల్లవారుజాము నుంచే ప్రధాన అర్చకులు స్వామి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. రాజమహేంద్రవరం, కడియం, మండపేట, ఆలమూరు ప్రాంతాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ధనలక్ష్మి స్వరూపంలో దర్శనమిస్తున్న ముసలమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ.. ఆరున్నర దశాబ్దాల



ఘన చరిత్ర కలిగిన ముసలమ్మ తల్లిని కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా భక్తులు విశ్వసిస్తారని తెలిపారు. ఏడు సంవత్సరాల క్రితం రూ.5 లక్షలతో ప్రారంభించిన కరెన్సీ అలంకరణను ఈ ఏడాది రూ.50 లక్షలకు విస్తరించినట్లు చెప్పారు. మహిళా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక హారతులు, భక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. "జై ముసలమ్మ తల్లి" నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

# ముసలమ్మ తల్లి సన్నిధిలో కంబాల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు




### మహిళా భక్తులకు పట్టుచీర పంపిణీ

**రాజమహేంద్రవరం: జయ జయహే**

ఆగస్టు 22: కడియపులంక వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కడియంలోని శ్రీ ముసలమ్మ తల్లి ఆలయంలో భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బిజెపి నాయకుడు కంబాల శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి పట్టుచీర సమర్పించారు.

అనంతరం ముసలమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కంబాల శ్రీనివాస్‌కు బెల్లంతో తులాభారం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను భారీ గజమాలతో ఘనంగా సత్కరించి, హిందూ ధర్మ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న విశేష సేవలను కొనియాడారు

వేదమంత్రోచ్చారణల నడుమ మహామంగళహారతి, కుంభహారతి, చిత్రహారతి, కర్పూరహారతి, పూర్ణహారతి తదితర విశిష్ట హారతులను అమ్మవారికి సమర్పించారు. అనంతరం సనాతన ధర్మం గొప్పతనం, భారతీయ సంస్కృతి పరిరక్షణపై ప్రత్యేకంగా సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా కంబాలశ్రీనివాసరావుమాట్లాడుతూ:

సనాతన ధర్మం అనేది ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప జీవన విధానం. మన దేవాలయాలు కేవలం పూజలు చేసే ప్రదేశాలు మాత్రమే కాదు, ధర్మాన్ని, సంస్కృతిని, నైతిక విలువలను భావితరాలకు అందించే పవిత్ర కేంద్రాలు. ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయాలను గౌరవిస్తూ దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలి. సమాజంలో సేవాభావం, దానగుణం, మానవత్వం పెంపొందినప్పుడే నిజమైన ధర్మం నిలుస్తుంది.

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రతి ఇంట సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆనందం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మహిళలు కుటుంబానికి వెన్నెముక వంటివారు. వారిని గౌరవించడం, ప్రోత్సహించడం మన అందరి బాధ్యత. అందుకే మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి, గో సంరక్షణ, భారతీయ సంస్కృతి పరిరక్షణతో పాటు సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటాం. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అవసరమైన సేవలు అందించడం మా లక్ష్యం. యువత భారతీయ సంస్కృతిని తెలుసుకుని ధర్మ మార్గంలో నడవాలని కోరుకుంటున్నాను. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో జీవించాలని ప్రార్థిస్తున్నాను. భవిష్యత్తులో కూడా మరిన్ని ఆధ్యాత్మిక, ధార్మిక, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ సమాజానికి అంకితభావంతో సేవ చేస్తాం."అనంతరం వెయ్యి మంది మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించి కార్యక్రమం విజయవంతంగా జరిగేలా సహకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, మహిళా భక్తులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, దాతలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రెల్లి కుటుంబాల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలి...జువ్వల రాంబాబు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల కార్మికులు, రెల్లి కుటుంబాల కోసం కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ ఎంప్లాయిస్ ఉ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత కోసం తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్న కార్మికుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. రెల్లి కుటుంబాలు సభలు, సమావేశాలు, వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ఎస్సీ , ఎస్.టి సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలి అని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీ. చిరంజీవి, బి. నాగేశ్వరరావు, బి. నారాయణ, రమేష్, బి. కొండ, బి. భవానీ, టీ. వెంకటలక్ష్మి, టీ. సునీత, పద్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌళిక వసతుల కల్పనకు కృషి

**అరకు/పాడేరు: జయ జయహే.**

అల్లూరి జిల్లా పాడేరు వైద్య కళాశాలలో మౌళిక వసతులు కల్పనకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి వీర పాండ్యన్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధనను అందించాలని, మౌళిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లెక్చరర్ హాల్ 1,2 లను సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య సిబ్బంది లెవనెత్తిన జిజిహెచ్, ఎంసిహెచ్ ఆసుపత్రులను వైద్య కళాశాల ప్రాంగణంకు తరలించు ప్రక్రియను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిషాంతి.టి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, పాడేరు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, జిల్లా ఇంచార్జ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం రియాజ్ బేగ్, పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కళాశాల సూపరిడెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో మెగా రక్తదాన శిబిరం

**విజయనగరం, ఆగస్టు 22, జయ జయహే :**

పద్మవిభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా చిరంజీవి యువత, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్ మరియు అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్.సి.ఎస్. థియేటర్‌లో ఘనంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జనసేన యువ నాయకులు, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షుడు చెల్లూరి ముత్యాల నాయుడు, రాష్ట్ర మెగా యూత్ ఫోర్సు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, అంజనీ పుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు లోపింటి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కంది వెంకటరమణ, ఎన్.సి.ఎస్. థియేటర్ మేనేజర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కంది వెంకటరమణ మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉ



ంటుందని, యువత పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. ఎన్.సి.ఎస్. థియేటర్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అభిమానులు కేవలం అభిమానం చూపడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా రక్తదానం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ట్రెజరర్ పొగిరి విశ్వేశ్వరరావు, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ రాముతో పాటు జిల్లా చిరంజీవి య-ువత తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల చేతికి అధికారం రావాలనే లోక్ సత్తా ఆవిర్భావం

### డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌ని అభినందించిన భీశెట్టి

**హైదరాబాద్ : (జయ జయహే )**

నిరంకుశ పాలనా వ్యవస్థ లోని లోపాలను ప్రజలకు చూపించి ప్రజలే ప్రభువులు, పాలకులు సేవకులే అనే నినాదంతో ప్రజల చేతికి అధికారం అందాలనే తపనతో ప్రజల్లో చైతన్యం తేవాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో సరిగ్గా 30 ఏళ్ళ క్రితం 1997 ఆగస్టు 3 న ఏర్పడిన గొప్ప ప్రజా ఉద్యమం పేరే లోక్ సత్తా అని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శుక్రవారం హైదరాబాద్ లోక్ సత్తా రాష్ట్ర కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ ని సత్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నీతి నిజాయతీలతో, నిబద్దత తో సేవలు అందించి సీనియర్ ఐఏఎస్ అధికారిగా ప్రజల్లో ఎంతో గౌరవం పొందిన డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ తన ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక గొప్ప పౌర సమాజ ఉద్యమ సంస్థ గా లోక్ సత్తా ని ఏర్పాటు చేసారని, నేటికీ దేశ వ్యాప్తంగా లోక్ సత్తా కి ప్రత్యేక గుర్తింపు ఉందని, మురికి గా మారిన రాజకీయాలని తిట్టుకోకుండా మార్చే తీరుని జేపీ ప్రజలముందు ఉంచారని, ఆటగాళ్లనుకాదు, ఆటతీరుని మార్చాలని లోక్ సత్తా నొక్కి చెప్పిందని,పాలనా వ్యవస్థ ప్రక్షాళన బ్యాలెట్ బాక్స్ దగ్గరే మొదలవ్వాలని యువత కి పిలుపు నిచ్చి, పరిపాలన లో పారదర్శికత, జవాబుదారిత నం కోసం లోక్ సత్తా అలుపెరుగని కృషి చేసిందని, 2005 లో నాటి సమాచార హక్కు చట్టం తీసుకురావటంలో జేపీ నిర్ణయాత్మక పాత్ర పోషించా రని భీశెట్టి అన్నారు, దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ గొప్ప నాయకత్వాన్ని సమాజానికి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ అందించారాని అయన అన్నారు. జేపీ ఏర్పాటు చేసిన లోక్ సత్తా పార్టీ కూడా అదే పందాలో రెండు తెలుగు రాష్ట్రాల్లో పనిచేసిందని భీశెట్టి అన్నారు

## సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

### అడ్డకట్ల సుబ్బారావు

**డుంబ్రిగూడ: ఆగస్టు 22. జయ జయహే.**



డుంబ్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డకట్ల సుబ్బారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ. అరకు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర ఆధ్వర్యంలో , రాష్ట్ర కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో నమ్మకాన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను మండలంలోని కూటమి నాయకులు కార్యకర్తలు వారి వారి గ్రామ గ్రామాలకు ఇంటింటికి వెళ్లి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజాలకు వివరిద్దాం. అనంతరం సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ, సమర్ధ నాయకత్వంలో అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ అభివృద్ధి దూసుకుపోతుందని స్పష్టం చేశారు,



## అంగన్వాడి భవనం నిర్మాణం చేయాలి

**డుంబ్రిగూడ: ఆగస్టు 22. జయ జయహే.**

మండలంలోని కంద్రుం పంచాయతీ ఉజ్జంగి గ్రామంలో అంగన్వాడీ భవనం నిర్మాణం చేయాలి -మినీ అంగన్వాడీ కేంద్రాన్ని మెయిన్ అంగన్వాడీ కేంద్రంగా చేయాలి -ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తామర్ల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఉజ్జంగి గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం గ్రామ కమిటీ సమావేశం శనివారం రోజు నిర్వహించడం జరిగిందని చెప్పారు. గ్రామ కమిటీ సమావేశం అనంతరం గ్రామ కమిటీ మొత్తం 10మంది సభ్యులతో ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు. గ్రామ కార్యదర్శి పాంగి రఘు, అధ్యక్షుడు గా తాంగుల రఘురామ్, ఉపాధ్యక్షులు గా కొర్రా రాజ్ గున్, తాంగుల సహాదేవ్, అధ్యక్షులు గా కొర్రా లైకోన్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని అనేక సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యచరణ రూపొందించడం జరిగిందనీ తెలిపారు. ఉజ్జంగి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందనీ చెప్పారు. సుమారు 100కుటుంబాలు ఉన్నారని, అంగన్వాడీ సెంటర్లో సుమారు 80మంది చిన్నారులు పౌష్టికాహారం పొందుతున్నారనీ చెప్పారు. కనీసం అంగన్వాడీ భవనం కూడా లేకుండా అంగన్వాడీ సెంటర్ నడుస్తోందనీ తెలిపారు. వెంటనే అంగన్వాడీ భవనం నిర్మాణం చేసి, మెయిన్ అంగన్వాడీ కేంద్రంగా చేయాలనీ డిమాండ్ చేశారు. గ్రామంలో వీధుల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తు లో దశలవారిగా పోరాటం కొనసాగిస్తామనీ ఈ సందర్భంగా మీడియా ద్వారా తెలిపారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు కొర్రా. భీమన్న, తాంగుల. గంగాధర్, పాంగి. లైకోన్, పాంగి. అప్పలరాజు, తాంగుల. చిన్నేశ్వరావు, పాంగి. గోవర్ధన్, కొర్రా. స్వామి పాల్గొన్నారు.

# జూడాల గోడు వినేవారెవరు






**- స్టైఫండ్ కోసం రోడ్డెక్కిన వైద్య విద్యార్థులు**

**- కనీసం 15 శాతం పెంచాలన్నా వినే నాధుడే లేడని ఆవేదన**

**- 62 నుండి 65 కు పెంచిన వయోపరిమితిని రద్దు చేయాలి**

**విశాఖపట్నం, ఆగష్టు 22, జయ జయహే :**

ప్రాణాపాయంలో ఉన్న రోగులకు వైద్యం చేయాల్సిన డాక్టర్లు , తరగతి గదిలో ఉండాల్సిన వైద్య విద్యార్థులు రోడ్లపైకి వచ్చి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. మా బాధలను వినండి మహా ప్రభో అంటున్నా ప్రభుత్వం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. సుదీర్ఘ కాలంగా తమ సమస్యలపై ప్రభుత్వాలకు విన్నవించినా దున్నపోతు మీద వర్షం కురుస్తున్నట్లు జూడాల సమస్యలు పట్టనట్లు వ్యవహరిస్తోంది చంద్రబాబు ప్రభుత్వం. ప్రభుత్వ ,అధికార యంత్రాంగాల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా గతి లేని పరిస్థితుల్లో తమ సమస్యల పరిష్కారం కోరుతూ పోరాటం కొనసాగిస్తున్నారు వైద్య విద్యార్థులు. రాష్ట్రంలో 19 వైద్య కళాశాలల్లో సుమారు 3500 కు పైగా యువత వైద్య విద్యను అభ్యసిస్తున్నారు .ప్రస్తుతం రూ.16000 విద్యార్థులకు స్టైఫండ్ అందిస్తున్నారు . పెరిగిన ధరలు ఖర్చుల కారణంగా ప్రస్తుతం అందిస్తున్న 2 శాతం స్టైఫండ్ ను 30 శాతం పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు జూడాలు. 2009 లో ఇచ్చిన జి.ఓ ప్రకారంగానే పెంచాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం తుంగలో తోక్కడాన్ని ఏమనుకోవాలో . ప్రతి రెండేళ్లకోసారి స్టైఫండ్ పెంపుదల చేయాలి . జి.ఓ ఆధారంగానే విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు . పక్కనే ఉన్న వెనుకబడిన రాష్ట్రం ఒడిస్సాలో రూ.83000 ఇస్తుండగా అగ్రగామి రాష్ట్రంగా చెప్పుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఎందుకు చేయలేదు . ప్రభుత్వం నిధుల లేమి పేరుతో కాలయాపన చేస్తుందని యోగంధ్ర వంటి ప్రచార కార్యక్రమాలకు మాత్రం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని వాపోతున్నారు . గతం జనవరి నుండి ఇప్పటి వరకు ప్రభుత్వంతో 3 దపాలుగా జరిగిన చర్చల్లో స్టైఫండ్ పెంపుపై ససేమిరా అంటున్నారని కనీసం 15 శాతానికి పెంచుతామని గతంలో చెప్పిన మాటను గాలికోదిలేసారు . ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైద్యవిద్యర్థులకు సుమారుగా 87 కోట్లు అవసరం అవుతుంది . ప్రభుతం వైద్య శాఖ కోసం కేటాయించిన రూ.13,500 కొట్లలో ఇది 0.3 శాతం మాత్రమే . వైద్య రంగలో పరిశోధనలు పెరగాలన్నా, నాణ్యమైన మానవ వనరులు తయారుకావాలన్నా వారిని ప్రోత్సహించాల్సిన బాద్యత ప్రభుత్వాలదే . అనవసర ప్రచార అర్భాటాలకు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న ప్రభుత్వం వైద్య విద్య పై ఎందుకు నిర్లక్ష్యం పట్ల అంతర్యం ఏమిటో వైద్యుల వయోపరిమితి 62 నుండి 65 కు పెంపుదల చేశారు. ఇది వైద్యులను నిరుద్యోగులుగా మార్చడమేనని విమర్శిస్తున్నారు . మరో మూడేళ్ళ వరకు వైద్యులు పదవీవిరమణ చేయకపోతే ఖాళీలు ఏర్పడవు , నియామకాలు జరగవు . మరి ప్రభుత్వ వైద్య శాఖల్లో యువ డాక్టర్లకు పనిచేసే అవకాశం ఎలా వస్తుంది . ప్రభుత్వం ఆర్థిక భారం తగ్గించుకోవడానికి చేసే చర్యలు యువ వైద్యులను ఒత్తిడికి గురిచేయడమే . పెంచిన వయోపరిమితి ని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు . వైద్య విద్య బోధనా ఉపాధ్యాయులుగా పి.హెచ్.డి చేసిన వారికి అవకాశం కల్పిస్తున్నారు . పి.జి చేసిన వారితోనే బోదించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు . డాక్టర్లకు డాక్టర్లే బోదిస్తే నైపున్యవంతంగా ఉంటుదని వాపోతున్నారు. ప్రభుత్వ మొండి వైకరితో విసిగిన జూడాలు అత్యవసర సేవలను రద్దు చేసుకున్నారు . ఇప్పటికే సిబ్బంది కొరతతో నడుస్తున్న ఆసుపత్రులు జూడాల నిర్ణయం మరింత ఒత్తిడి పెంచడమే. ప్రభుత్వ వ్యవహారం ఒకవైపు వైద్య విద్యార్దుల భవిష్యత్ ను ప్రజల ఆరోగ్య సేవలను నిర్లక్ష్యం చేయడమే . ప్రభుత్వాలు పునరాలోచించాలి . మెరుగైన వైద్యం కావాలంటే మెరుగైన పరిస్థితులు కల్పించి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని అడుగుతున్నా పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం . ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పట్టించుకోకపోగా వైద్య విద్యార్థుల మద్య విబేదాలు సృష్టించే గ్రూపు రాజకీయాలకు పాల్పడటం విడ్డూరం. తమ న్యాయమైన డిమాండ్లను పరిస్కరిస్తే తప్ప విరమించేది లేదంటున్న జూనియర్ డాక్టర్ల ఉద్యమం ఎలాంటి ఫలితాన్ని రాబడుతుందో కాలమే నిర్ణయిస్తుంది.

# చిప్పగిరిలో ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

**చిప్పగిరి (జయ జయహే)**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన చిప్పగిరిలో వెలసిన శ్రీ గోవిందప్ప స్వామి దేవస్థానం నందు గత ఐదు రోజులుగా జరుగుచున్న ధార్మిక కార్యక్రమాలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ప్రతిరోజు స్మాత్మానంద స్వామిచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం గోపూజ మరియు సామూహిక కుంకుమార్చనలు, బళ్ళారి దత్తపీఠం జె. శాంతమ్మ ఆధ్వర్యంలో భగవద్గీత గోల్డెమెడలిస్ట్ పి. నీరజాక్షి, వై. రజనీ, పి. ఆదిలక్ష్మి బృందంచే భగవద్గీత పారాయణం భక్తిపారవశ్యం కలిగించాయి. సమాజంలో భక్తిచింతన కలిగించుటకు ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు నాగనాథనహళ్ళి రాఘవాచార్, ఎల్. రామచంద్ర, పి. గురుప్రసాద్, పి.వి.యం. చెన్నవీరయ్యస్వామి, యం. లక్ష్మీ నారాయణ, యస్. లోకేశ్, పి.షణ్ముఖతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర సాధన ప్రతి ఒక్కరి

# సామాజిక బాధ్యత

డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ ని పరిశుభ్రమైన, పచ్చని రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం చేపట్టిందని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు పేర్కొన్నారు.

32 వ వార్డు దేవాంగుల వీధిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.




పరిసరాల పరిశుభ్రతపై స్థానిక ప్రజలకు ఆయన వివరించి ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ఊరూవాడా పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణ, చెత్త రహిత వీధులు, పర్యావరణ పరిరక్షణ ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలని వివరించారు.

శుభ్రతపై ప్రతి ఒక్కరిలోనూ మార్పు రావాలన్నారు.

ప్రతి ఒక్కరూ జీరో–వ్యర్థాల జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర నిర్వహణ, స్వర్ణాంధ్ర సాధన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, పరిసరాల పరిశుభ్రత వల్ల ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చునని తెలిపారు.

# జీవో 161జారీపై జీవీఎంసీ మినిస్టీరియల్ ఉద్యోగుల సంబరాలు

**ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజుకు కృతజ్ఞతులు తెలిపిన జీవీఎంసీ సిబ్బంది**

**ఇకపై జోనల్ బదిలీలు కాకుండా కమిషనరే సర్వాధ్యక్షులు**

**విశాఖపట్నం, ఆగస్టు 22, జయ జయహే**




జీవీఎంసీలోని మినిస్టీరియల్ సిబ్బందికి అనుకూలంగా జీవో 135ను సవరిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో 161విడుదల చేయడం పట్ల మినిస్టీరియల్ ఉద్యోగులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ మేరకు కూటమి సర్కార్ కు, వివిధ విభాగాల ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద అభినందన సభ ఏర్పాటు చేశారు. జీవీఎంసీ జోనల్, మల్టీ జోనల్ బదిలీలకు సంబంధించి ఉద్యోగుల ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కొత్త జీవో జారీ చేయడం పట్ల వాళ్లంతా సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన సహకారం మరవలేనిదని, రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని ఏపీ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో కూడా ఈ అంశంపై చర్చించారని గుర్తు చేశారు. ఆయన కృషి వల్లే సవరణతో కూడిన కొత్త జీవో వచ్చిందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఏపీ జేఏసీ (విశాఖ) చైర్మన్ సత్తి నాగేశ్వర్ రెడ్డి, వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ వామనరావు, జీవీఎంసీ ఏఐటీయూసీ అధ్యక్షులు పడాల రమణ, సీఐటీయూ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి రవి, జీవీఎంసీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ. అప్పలనాయుడు, సన్నీ, ఉమెన్ సెక్రెటరీ సుబ్బలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మజ, లంకా రాంప్రసాద్, వి. శ్రీనివాసరావు, రాజేష్, జగన్, ప్రసన్న కుమార్ తో పాటు అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై తమకు సహకరించిన వారందరికీ, విశాఖ ఎమ్మెల్యేలకు మరోమారు ధన్యవాదాలు తెలిపారు. ప్రెసిడెన్షియల్ అంశాన్ని ప్రస్తావించకుండా ఇకపై తమ ఉద్యోగాలకు జీవీఎంసీ కమిషనరే సర్వ సైన్యాధ్యక్షులని నేతలు పేర్కున్నారు. తమకు ఎప్పటికైనా జీవీఎంసీ పరిధిలోనే బదిలీలు, పదోన్నతులు ఉంటాయని స్పష్టం చేశారు.



కాణిపాకం దేవస్థానం ఆధ్వర్యంలో

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర

**పూతలపట్టు/ కానిపాకం, ఆగస్టు 22, జయ జయహే.**

శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారంఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ సూచనల తో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్రకార్యక్రమం నిర్వహించారు. ఈ.వో పెంచల కిషోర్ , దేవస్థానం సిబ్బందితో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ పై, పారిశుధ్యం పై భక్తులకు షాపుల వారికి, తోపుడు బండ్ల వ్యాపారస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు శివ ప్రసాద్, నరేష్, సుబ్బారెడ్డి, అనసూయ, వసంత, శ్రీ వాణి, ఏఈఓలు ఎస్వి కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపర్డెంట్ కోదండపాణి, దివాకర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఏ.ఈలు, శానిటారీ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే శ్రీనివాసుల ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుక

**తిరుపతిటౌన్,ఆగస్ట్ 22, జయ జయహే.**

మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే అరణి శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు.అనంతరం రుయా ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. స్వయం కృషితో చిరంజీవి మెగాస్టార్ గా ఎదిగారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. దశాబ్దాలుగా తన నటనతో కోట్లాది మంది ప్రేక్షకులను అలరిస్తూ తన కృషి, పట్టుదలతో యువతకు చిరంజీవి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీశ్సులతో మెగాస్టార్ చిరంజీవి ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని ఆయన కోరుకున్నారు. కార్యక్రమంలో తమ్మినేని వేంకటేశ్వర రావు, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, ఎస్ కే బాబు, హరిశంకర్, జీవకోన సుధాకర్, అంకాళమ్మ ఆలయ పాలకమండలి ఛైర్మన్ కొండా రాజ్ మోహన్, రాజేష్ ఆచ్చారి, హెడిసి సభ్యులు బండ్ల లక్ష్మీపతి రాయల్, బాలిశెట్టి కిషక్షర్, బాబ్జీ, ఏ. వెంకటేష్, జీవన్ రాయల్, సుమన్, ఆళ్వార్ మురళీ, రమేష్ నాయుడు, శిరీషా, రవి, సుబ్బారావు, చిన్నా, రమణా రెడ్డి, గంగమ్మగుడి పాలకమండలి సభ్యురాలు మధులత, జానకి రామ్ రెడ్డి, ఉదయ్, పవన్ ముఖేష్,జిన్నా తదితరులు పాల్గొన్నరు.




# పోక్సో చట్టంపై అవగాహన ప్రతి విద్యార్థినికి అవసరం

**ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎన్. రెడ్డి ప్రసన్న**

**ధవళేశ్వరం, (జయ జయహే**

చిన్నారులపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం అత్యంత శక్తివంతమైనదని, ప్రతి విద్యార్థిని ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, జువెనైల్ జస్టిస్ బోర్డు ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ ఎన్. రెడ్డి ప్రసన్న అన్నారు.ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కలెక్టరేట్ వెనుక ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చట్టాలపై అవగాహన ఉంటేనే నేరాలను ధైర్యంగా ఎదుర్కొని న్యాయం పొందే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని, ఎలాంటి వేధింపులు ఎదురైనా మౌనంగా ఉండకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారంఇవ్వాలని సూచించారు. విద్యతో పాటు మంచి నడవడి, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ జీవిత విజయానికి పునాదులని పేర్కొన్నారు. ధవళేశ్వరం ఎస్సై బి. హరిబాబు మాట్లాడుతూ, చిన్నారుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పీర్ ప్రెజర్, ఈవ్‌టీజింగ్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. విద్యార్థులు సురక్షితంగా, నిర్భయంగా చదువుకునే వాతావరణం కల్పించడం పోలీస్ శాఖ బాధ్యత అని, విద్యే వారి భవిష్యత్తును నిర్మిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, బాలల హక్కులు, ఈవ్‌టీజింగ్ నివారణ, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం, సైబర్ భద్రత, అపరిచితులతో వ్యవహరించే విధానం వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థినులు హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు.

# దేశీయ విత్తనాల రాఖీలను వినియోగించండి




### ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ రాఖీలు వద్దే వద్దు

### జీవరాశితో ఉన్నది ఒక్కటే భూగోళం అని మరవవద్దు.. జెవి రత్నం,

**విశాఖపట్నం (జయ జయహే)**

దేశీయ విత్తనాల రాఖీలను మాత్రమే వినియోగించండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శనివారం ఉదయం మద్దిలపాలెం లోని అక్షర ఇంగ్లీష్ మీడియం విద్యా సంస్థలో దేశీయ విత్తనాల రాఖీలు ప్రిన్సిపల్ సునీత అధ్యక్షతన నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ఏడాది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు సైతం విత్తనాల రాఖీలు వినియోగించాలని కోరారని ఆయన వివరించారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ తో రాఖీ లు వద్దే వద్దు అని వివరించారు. ఈ ప్లాస్టిక్ ఆధారంగా తయారు చేసిన రాఖీల వల్ల జీవరాశికి హాని కలుగుతుందని వివరించారు. జీవరాశితో ఉన్నది ఒక్కటే భూగోళం అని మ-రవవద్దు అని వివరించారు. సమస్త జీవరాశినీ పరిరక్షించడం మానవాళి బాధ్యత అని పేర్కొన్నారు. కంపెనీలు తమ లాభం కోసం కృత్రిమ రంగులతో, ప్లాస్టిక్ రాఖీలు నయనానందకరంగా తయారు చేయడం జరుగుతుందని, కానీ మనం వాటిని వినియోగిస్తే మానవాళికే కాదు సమస్త జీవరాశి కి నష్టం కలుగుతుందని వివరించారు. ప్రస్తుతం మనం ఉన్న పర్యావరణ పరిస్థితులలో ప్లాస్టిక్ రహిత రాఖీలు వినియోగించడం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, యాక్షన్ ఏడు సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో సమన్వయకర్త జె రాజేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో పాల్గొని రాఖీలు తయారు చేయడం జరిగింది.




## కాణిపాకం బ్రహ్మోత్సవాలపై సమీక్ష

**పూతలపట్టు/ కాణిపాకం, ఆగస్టు 22, జయ జయహే.**

శ్రీస్వయంభువరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 14వ తేదీ నుండి అక్టోబర్ 4వ తేది వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలపై శనివారం దేవస్థానం సమావేశ మందిరం లో పాలకమండలి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన నఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆలయ ఈవో పెంచల కిషోర్, ఆలయ చైర్మన్ మణి నాయుడు, వివిధ భాగాలు అధికారులు హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బ్రహ్మోత్సవాల నిర్వహణలో భక్తుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కాణిపాక బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు. భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలు అందించాలన్నారు. భక్తులను అప్రమత్తం చేయడం కొరకు మైకుల ద్వారా హెచ్చరికలు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఆలయ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ క్యూలైన్ నందు వేచి ఉండు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనంకు వచ్చిన ముఖ్య అతిథులకు దర్శనము త్వరగా చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ దూడి మాట్లాడుతూ కాణిపాకం ఆలయ పరిసర ప్రాంతాలలో ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఒక సెంట్రల్ కమాండో కంట్రోల్ రూమ్ ని ఏర్పాటు చేసుకుని 24 గంటలు పోలీసులు నిఘా పెట్టాలన్నారు. విద్యుత్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలని విద్యుత్ అంతరాయం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పి వెంకటనారాయణ, కాణిపాకం ఎస్సై నర్సింహులు పోలీసు సిబ్బందివివిధ శాఖలకు సంబంధించిన అధికారులు దేవస్థాన పాలక మండల సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజు నాయుడు, సుధాకర్ రెడ్డి, వసంతమ్మ, అనసూయమ్మ, శ్రీవాణి ,కృష్ణవేణి, రాజ్యలక్ష్మి సంధ్యారాణి, సుబ్రహ్మణ్యం రెడ్డి, శివప్రసాద్ ,సతీష్, నరేష్,పద్మలత, తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన ఏఏపి దీక్షలు

**చోడవరం,ఆగస్టు 22 జయ జయ హే**

గోవాడ చెరుకు రైతులు,కార్మికుల బకాయిలు చెల్లించాలనీ కోరుతూ..ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా చేపట్టిన నిరసన కార్యక్రమాలను శనివారంతో ముగిసాయి. సుమారు 70 సంవత్సరాల చరిత్ర గల గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూత పెట్టడం జరిగిందనీ, 23700 షేర్ హోల్డర్స్ ఉన్న రైతులకు నేటికీ 38 కోట్ల రూపాయలు పడి ఉన్న ఈ ప్రభుత్వం నేటి కూడా చెల్లించకుండా రైతులను రోడ్డు మీద పడేసిశీదన్నారు. దీనికి సంబంధించి 15 రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్న తరుణంలో ప్రభుత్వంలో కొంత కదలక వచ్చిన నేపథ్యంలో కొంతకాలం ఈ నిరసన కార్యక్రమానికి నిలుపుదల చేసి గ్రామ గ్రామాన రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పాదయాత్రలో మొదలుపెట్టి తర్వాత మరల ఈ ప్రభుత్వంలో మార్పు రాకపోతే నిరాహార దీక్ష కార్యక్రమం చేపడతామని ఆమాద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం మండల కార్యదర్శి వేగి మహాలక్ష్మి నాయుడు వెంకటపతి రాజు పల్లి వెంకటరమణమూర్తి కామిరెడ్డి శంకర్రావు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



## "అంగన్వాడీ కార్యకర్తల జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం"

**చోడవరం ఆగస్టు 22 జయ జయహే**

రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల చోడవరం మండలంలో గల 76 మంది అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా కెఆర్పిలు సూపర్వైజర్ శాంతి ప్రియ, లక్కవరం స్కూల్ టీచర్ సురేష్, గన్నవరం స్కూల్ టీచర్, గణేష్ , గౌరీపట్నం స్కూల్ టీచర్ ప్రశాంత్ కుమార్ అంగన్వాడీ కార్యకర్తలకు 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలలో వైకల్యాలను గుర్తించడం ఎలా అనే దాని గురించి అలాగే సమ్మిళిత విద్య గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో చోడవరం మండలం అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# డీఎస్సీపై ప్రజల మనస్సు మార్చాలని జగన్ శత విధాల యత్నం

### చెప్పిందే చెప్పి నిజం చేయాలనుకోవడం అవివేకం

### టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు, ఆగష్టు 22, జయ జయహే**



డీఎస్సీలో ఉద్యోగాలు అమ్ముకున్నారంటూ వస్తున్న పుకార్లు వైసీపీ నేతలే సృష్టిస్తున్నారని టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య ఆరోపించారు. నిన్న ఓ మహా నటి మాజీ సీఎం జగన్ వద్దకు వెళ్లి మాటాడిన మాటలను ఆ పార్టీ సోషల్ మీడియా తెగ వైరల్ చేసి అభాసు పాలయ్యిందని గుర్తు చేశారు. పరీక్ష రాయకుండానే ఉద్యోగం ఇస్తామంటూ రాధిక అనే అభ్యర్థి నుంచి డబ్బులు వసూలు చేశారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అబద్ధమని కొట్టి పారేశారు. ఈ మేరకు ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో నమోదైన కేసు నెంబర్ 726/2025 వివరాల ప్రకారం నిందితులకు డబ్బులు బదిలీ చేసిన సమయం గతేడాది ఏప్రిల్ 13 నుంచి ఆగష్టు 4వ తేదీ మధ్య కాలానికి సంబంధించినదంటే ఇది డీఎస్సీ పరీక్ష సమయానికి కంటే ముందే జరిగిందన్న వాస్తవం గ్రహించాలన్నారు. ఫిర్యాదుదారు రాధిక, నిందితురాలు ఎ-1 నాగజ్యోతి ఇద్దరూ ఒంగోలులోని హర్షిణి డిగ్రీ కళాశాలలో కలిసి చదువుకున్నారని, మరో నిందితుడు ఏ-2 అడపా భాను ప్రకాశ్, ఫిర్యాదుదారు రాధికకు కూడా ముందు నుంచే సన్నిహితుడని పేర్కొన్నారు. వీరి మధ్య గతంలో కూడా వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలున్నాయని, అయితే రాధిక అసలు డీఎస్సీ పరీక్ష రాయలేదని లక్ష్మయ్య అన్నారు . అయితే కొందరు వాస్తవాలు తెలుసుకోకుండా, తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించేలా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, ఇది పూర్తిగా వ్యక్తుల మధ్య జరిగిన మోసానికి సంబంధించిన కేసుగానే పరిగణించాల్సిందిగా కోరారు. ఈ సంఘటనకు ప్రభుత్వానికి కానీ, రాజకీయ నాయకులతో కానీ ఎలాంటి సంబంధం లేదని, తప్పుడు వార్తలు, పుకార్లు రాష్ట్రంలో వ్యాప్తి చేయడం నేరమని తెలిపారు.




### నిడదవోలులో ఘనంగా

## స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలు, పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు "స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర" మరియు "స్వచ్ఛతే సేవ" కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిడదవోలు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో "స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర" మరియు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు--2026పై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పరిశీలకులు డి. దావీదు రాజు మాట్లాడుతూ నిడదవోలు పట్టణాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచేందుకు మున్సిపాలిటీ నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రజలు కూడా మున్సిపాలిటీకి సహకరించి బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, తడి--పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. "స్వచ్ఛ నిడదవోలు -- ఆరోగ్యకరమైన నిడదవోలు" సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, సంబంధిత సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



### కూలీలకు గిట్టుబాటు కానీ

## ఉపాధి పథకం

**తోట్టంబేడు, ఆగస్టు 22,జయ జయహే.**

మహాత్మా గాంధీ నుంచి వీబీజీరాంజీగా మారిన తర్వాత ఉపాధి హామీ పథకం వ్యవసాయ కూలీలకు ఏమాత్రం గిట్టుబాటు కావడంలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేతలు గంధం మణి, పెనగడం గురవయ్యలు విమర్శించారు. సామాజిక శంఖారావం చైతన్య యాత్రలో భాగంగా శనివారం తొట్టంబేడు మండలంలోని చియ్యవరం, చేమూరు దళితవాడల్లో కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించారు. అక్కడ జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. గతంలో రోజు వారీ కూలీ రూ. 300 ఉండగా, నేడు రూ. 100కు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిది వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో వేతనాలు ఇవ్వకుంటే వడ్డీతో కలిపి ఇస్తామన్న మోడీ హామీ మట్టిలో కలిసిపోయిందని ఎద్దేవా చేశారు. చేమూరు దళితుల సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చియ్యవరంలో మంచినీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో పురుగులు దర్శనమిస్తున్నాయనీ, వాటిని తాగుతున్న గ్రామస్తులు అనారోగ్యం పాలవుతున్నారని మండిపడ్డారు. దళితుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 24న చలో కలెక్టరేట్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ నాయకులు గురునాథం తదితరులు పాల్గొన్నారు.



## కొయ్యూరు పోలీసుల ఉక్కుపాదం

### ఇద్దరు అన్నదమ్ములు సెంట్రల్ జైలుకు..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 23,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన అన్నదమ్ములైన మాగాపు చక్రవర్తి మరియు మాగాపు గంగాధర్ లపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. వీరిపై గతంలో పలు గంజాయి అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. పదేపదే అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతూ యువతను మాదకద్రవ్యాల వైపు ఆకర్షిస్తున్న నేపథ్యంలో వీరి కార్యకలాపాలను పోలీసులు తీవ్రంగా పరిగణించారు. ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వీరిపై చట్టపరమైన చర్యలు చేపట్టి, నిర్బంధ ఉత్తర్వుల మేరకు ఇద్దరినీ సెంట్రల్ జైలు, విశాఖపట్నంకు తరలించడం జరిగిందీ అన్నారు. కొయ్యూరు మండలంలో గంజాయి రవాణా, విక్రయాలు, సరఫరాకు పాల్పడే వారికి ఇది స్పష్టమైన హెచ్చరిక. గంజాయి వ్యాపారంతో యువత భవిష్యత్తును నాశనం చేసే వారిపై ఎటువంటి ఉపేక్ష ఉండదు. అందుబాటులో ఉన్న అన్ని చట్టపరమైన మార్గాల ద్వారా కఠిన చర్యలు తీసుకుంటాము అన్నారు. గంజాయి అక్రమార్కులకు సహకరించేవారు, ఆశ్రయం కల్పించేవారు, రవాణాకు సహకరించే వారిపైనా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని, గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రజలు పోలీసులతో కలిసి పనిచేయాలి అని అన్నారు.

# అనకాపల్లి జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలి

## వైఎస్ఆర్సిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్

**మునగపాక, ఆగస్టు 22, జయ జయహే:**

అనకాపల్లి జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని వైఎస్ఆర్సిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. మునగపాక మండల కేంద్రం మునగపాకలో వైఎస్ఆర్సిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు లేక పూర్తిగా పంటలు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారని, రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని ప్రసాద్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతన్న ఆదుకోవాలని, వ్యవసాయ రుణాలపై మారిటోరియం ప్రకటించి పంట నష్టపోయిన వరి రైతులను ఆదుకోవడం కోసం ప్రత్యామ్నాయ విత్తనాలను సరఫరా చేయడంతో పాటు రైతులకు తగు మేలైన సూచనలు ఇవ్వాలని ప్రసాదు సూచించారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ను మరో నాలుగు గంటలపాటు పొడిగించి రైతులకు నీటి సౌకర్యం కల్పించాలని, వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో రైతులకు బీమా చేయడంతో పంట నష్టపోయినప్పటికీ రైతులు బీమా సహాయం అందించాలని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను అన్ని



రకాలుగా దగా చేసి తీవ్రంగా ముంచేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, ఆడారి కాశి బాబు, శ్రీరామమూర్తి, మద్దాల వీరు నాయుడు, టెక్కలి కొండలరావు, రాజాన బుజ్జి, నరాలశెట్టి సూర్యనారాయణ, బొద్దపు శ్రీరామమూర్తి, కర్రి వెంకట సత్యనారాయణ, ఇల్లా నాగేశ్వరరావు, సుందరపు తాతాజీ, బిశెట్టి గంగ అప్పలనాయుడు, కాండ్రేగుల జగన్, ఆడారి గోపి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని వైఎస్ఆర్సిపి తరపున త్వరలోనే జిల్లా కలెక్టర్కు రైతులు అంతా కలిపి వినతిపత్రం అందజేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

# సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

**విశాఖపట్నం, ఆగస్టు 22, జయ జయహే**

బ్రిక్స్ సమావేశంలో పాల్గొనేందుకు శనివారం విశాఖకు విచ్చేసిన ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకి కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. జిల్లా ఇన్ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయతో పాటు ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు, గంటా శ్రీనివాస రావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సృష్టి సమాంతరంగా సాగాలి

(ప్రతాప్)




భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న సమయంలో, ఆ వృద్ధి ఫలాలు ఉద్యోగాల రూపంలో ఎంత విస్తృతంగా ప్రజలకు చేరుతున్నాయన్నది కీలకంగా మారింది. తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2026 ఏప్రిల్--జూన్ త్రైమాసికంలో 15 సంవత్సరాలు, అంతకంటే పైబడిన వారిలో దేశవ్యాప్త నిరుద్యోగ రేటు 5.4 శాతంగా నమోదైంది. జనవరి--మార్చి త్రైమాసికంలోని 5.0 శాతంతో పోలిస్తే ఇది 0.4 శాతం పాయింట్ల పెరుగుదల. అయితే ఈ ఒక్క సంఖ్యతో భారత ఉద్యోగ మార్కెట్ పరిస్థితిని అంచనా వేయడం సరైంది కాదు.

ప్రాంతాల వారీగా చూస్తే గ్రామీణ నిరుద్యోగం 4.8 శాతం, పట్టణ నిరుద్యోగం 6.7 శాతంగా ఉంది. గ్రామీణ రేటు కూడా గత త్రైమాసికంలోని 4.3 శాతం నుంచి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో విద్యార్హతలకు అనుగుణమైన ఉద్యోగాల కోసం పెరుగుతున్న పోటీ, అవకాశాల కేంద్రీకరణ, నైపుణ్యాల సరిపోలిక వంటి అంశాలు ఈ వ్యత్యాసాన్ని ప్రభావితం చేయవచ్చు.

అయితే అత్యంత ముఖ్యమైన అంశం యువ నిరుద్యోగం. 15--29 సంవత్సరాల యువతలో నిరుద్యోగం 15.9 శాతంగా ఉంది. గ్రామీణ యువతలో 14.7 శాతం, పట్టణ యువతలో 18.2 శాతంగా నమోదైంది. విద్య నుంచి ఉద్యోగానికి మారే దశలో యువతకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం, అప్రెంటిస్షిప్లు, ఇంటర్న్షిప్లు, కెరీర్ మార్గదర్శకత్వం మరింత అవసరమని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

ఇక్కడ ఉద్యోగాల సంఖ్యతో పాటు ఉద్యోగ నాణ్యత కూడా ముఖ్యమే. స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధికి అవకాశం, కెరీర్ పురోగతి కలిగిన ఉద్యోగాలు ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ విలువను అందిస్తాయి. అందువల్ల భవిష్యత్ ఉపాధి వ్యూహం "ఎన్ని ఉద్యోగాలు?"తో పాటు "ఎలాంటి ఉద్యోగాలు?" అనే ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వాలి.

మహిళల ఉపాధి భాగస్వామ్యం మరో కీలక అంశం. పట్టణ మహిళల నిరుద్యోగ రేటు 8.7 శాతం, పట్టణ పురుషుల రేటు 6.1 శాతంగా ఉంది. రవాణా, భద్రత, శిశు సంరక్షణ, అనువైన పనివేళలు, నైపుణ్య శిక్షణ వంటి అంశాలు మహిళల ఉద్యోగ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయి. మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించడం సామాజిక పురోగతితో పాటు దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచే ఆర్థిక అవకాశంగా చూడాలి.

మరో ముఖ్యమైన సూచిక లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (ఎల్ పి ఎఫ్ ఆర్). ఏప్రిల్--జూన్ 2026లో మొత్తం ఎల్ పి ఎఫ్ ఆర్ 54.6 శాతంగా ఉంది. గత త్రైమాసికంలోని 55.5 శాతంతో పోలిస్తే ఇది తగ్గింది. ఉద్యోగం కోసం ప్రయత్నించడం మానేసిన వ్యక్తి నిరుద్యోగిగా కాకుండా శ్రామిక శక్తి వెలుపల ఉన్న వ్యక్తిగా లెక్కించబడవచ్చు. అందుకే నిరుద్యోగ రేటుతో పాటు ఎల్ పి ఎఫ్ ఆర్ , వర్కర్ జనాభా నిష్పత్తి , వేతనాలు, పని గంటలు, ఉద్యోగ స్థిరత్వం వంటి సూచికలను కూడా పరిశీలించాలి.

జూన్ 2026 నెలవారీ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గణాంకాల్లో నిరుద్యోగ రేటు 5.5 శాతంగా నమోదైంది. దీనిని ఏప్రిల్--జూన్ త్రైమాసికపు 5.4 శాతంతో నేరుగా పోల్చకూడదు. ఒకటి నెలవారీ గణాంకం కాగా, మరొకటి మూడు నెలల కాలానికి సంబంధించినది. సీజనల్ మార్పులు కూడా నెలవారీ ఉద్యోగ గణాంకాలను ప్రభావితం చేయవచ్చు.

భారత్కు గ్రామీణ ఉపాధి విస్తరణ కూడా అవసరం. ఆహార ప్రాసెసింగ్, గిడ్డంగులు, కోల్డ్ చైన్, లాజిస్టిక్స్, గ్రామీణ పర్యాటకం, చిన్న పరిశ్రమలు, డిజిటల్ సేవలు వంటి వ్యవసాయేతర రంగాలను విస్తరించడం ద్వారా స్థానిక ఉపాధి అవకాశాలను పెంచవచ్చు. అదే సమయంలో టైర్-2, టైర్-3 నగరాలను కొత్త ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా మెట్రో నగరాలపై ఉద్యోగ ఒత్తిడిని తగ్గించవచ్చు.

తయారీ రంగం కూడా ఉద్యోగ సృష్టికి ప్రధాన ఆధారం. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధాలు, ఆటోమొబైల్స్, యంత్రసామగ్రి, పునరుత్పాదక ఇంధన పరికరాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెరిగితే ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు సరఫరా గొలుసులో పరోక్ష ఉపాధి కూడా పెరుగుతుంది. సేవారంగంలో ఆఈ, డిజిటల్ సేవలు, ఫిన్టెక్, ఆరోగ్య సేవలు, పరిశోధన, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలు అధిక విలువ కలిగిన కొత్త అవకాశాలను సృష్టించగలవు.

ఈ అవకాశాలను వినియోగించుకోవాలంటే విద్య--నైపుణ్యం--పరిశ్రమ మధ్య అనుసంధానం బలపడాలి. డిగ్రీల సంఖ్య కంటే పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు ముఖ్యం. అప్రెంటిస్షిప్లు, పరిశ్రమ భాగస్వామ్యంతో శిక్షణ, ఇంటర్న్షిప్లు, డిజిటల్ సామర్థ్యాలు యువతను ఉద్యోగ మార్కెట్కు మరింత సిద్ధం చేయగలవు.

భారత్ 20 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని పరిశీలించినా ఉద్యోగాల సృష్టి కీలకం. ఆర్థిక వృద్ధి ప్రజల ఆదాయాలు, వినియోగం, జీవన ప్రమాణాలను మెరుగుపరచాలంటే అది ఉద్యోగాలను సృష్టించే, ఉత్పాదకతను పెంచే, విస్తృతంగా పంచబడే వృద్ధిగా ఉండాలి. యువ జనాభా భారతదేశానికి గొప్ప ఆర్థిక వనరు; వారికి సరైన నైపుణ్యాలు, అవకాశాలు లభిస్తే అదే జనాభా దేశ అభివృద్ధికి ప్రధాన శక్తిగా మారుతుంది.

కాబట్టి 5.4 శాతం నిరుద్యోగ రేటును కేవలం ఆందోళనగా కాకుండా ఉపాధి వ్యవస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు ఒక సూచికగా చూడాలి. యువతకు మొదటి ఉద్యోగం, మహిళలకు విస్తృత అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర ఉపాధి, పట్టణాల్లో నాణ్యమైన ఉద్యోగాలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు---ఇవన్నీ సమన్వయంగా ముందుకు సాగాలి.

చివరికి భారతదేశం ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న కేవలం నిరుద్యోగ రేటును తగ్గించడం కాదు. ప్రతి యువ ప్రతిభకు సరైన అవకాశం, ప్రతి నైపుణ్యానికి తగిన పని, ప్రతి ప్రాంతానికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం అసలు లక్ష్యం కావాలి. ఆర్థిక వృద్ధి, ఉత్పాదకత, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సృష్టి కలిసి ముందుకు సాగినప్పుడే భారత జనాభా శక్తి నిజమైన ఆర్థిక బలంగా మారుతుంది.



# విద్యార్థులకు పోలీసుల అవగాహన కార్యక్రమం..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 23,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ను కొయ్యూరు సీఐ, మంప ఎస్ఐ శ్రీనివాస్ మరియు పోలీస్ సిబ్బంది సందర్శించారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, భోజన నాణ్యత, సంక్షేమం, బోధనా సిబ్బంది పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వ్యక్తిత్వ వికాసం, ఉన్నత విద్య మరియు కెరీర్ అవకాశాలు, గంజాయి, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు,రాజ్యాంగం కల్పించిన పిల్లల హక్కులు, మహిళలపై నేరాల నివారణ, డిజిటల్ భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలతో మంచి పౌరులుగా ఎదగాలని, సోషల్ మీడియాను జాగ్రత్తగా వాడాలని పోలీసులు సూచించారు. విద్యార్థుల భద్రత, సంక్షేమంపై పోలీస్ శాఖ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తుందని తెలిపారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలికిన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**అచ్యుతాపురం, ఆగస్టు 22, జయ జయహే:**

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా అలమండ కోడూరు కు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రావడంతో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్వాగతం పలికారు.






# ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

**మాడుగుల ఆగస్టు 22 జయ జయ హే**

సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు మాడుగులలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవత మోదుగ అమ్మవారి ఆలయంలోనూ శ్రీదేవి తల్లి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బడుగుల సెయింట్ ఆన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. తదుపరి మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు రొట్టెలు అందజేశారు. అంతకుముందు మాడుగుల బస్టాండ్ రావణంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అభిమానులు ఎస్ లోకేష్, జవ్వాది వరహాలు, భీముని జగన్నాధరావు, బసవ పరమేశ్వరరావు, ఎస్ సత్తిబాబు, దంగేటి గోపి, పి రమేష్.,దాసరి అప్పారావు, కే శ్రీధర్, డి రామచంద్రరావు, జొన్నపల్లి రమేష్, ఎన్ రమణ,కే శంకర్, డి చిన్న, రాజేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.



# కరకుదురులో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

**కాకినాడ (జయ జయహే)**

అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం కరకుదురు గ్రామంలో తోటకూర సత్తిబాబు యూత్ ఆధ్వర్యం లో మెగాస్టార్ చిరంజీవి 71 వ జన్మదిన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరకుదురు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సింగినీడి దత్తుడు విచ్చేసి మెగాస్టార్ చిరంజీవి 71 వ దినోత్సవ కేకు కటింగ్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ సందర్భంగా కరకుదురు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సింగినీడి దత్తుడు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి 70 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 71 వ జన్మదిన వేడుకలు ఈరోజు కరకుదురు గ్రామంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు, ఈ కార్యక్రమంలో పెమ్మన బోయిడి విగ్నేశ్వరరావు, తోటకూర వెంకటేశ్వరరావు, పాఠంశెట్టి వెంకటేష్, తోటకూర దొర, ఆకుల సత్తిబాబు, బుద్దాల మాణిక్యాలరావు, వసంత రాజు, పాఠం శెట్టి వీరన్న, బొచ్చే గంగాధర్, మరియు చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com